
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

ఖమ్మం
మంగళవారం ఉష్ణోగ్రత ఖమ్మం: గరిష్ఠం 29 । కనిష్ఠం 19 | భద్రాద్రి: గరిష్ఠం 29 । కనిష్ఠం 19 ◆ బుధవారం, 10 జనవరి 2024

అడ్డొస్తే తొక్కిస్తాం!

- హద్దు మీరుతున్న ఇసుకమాఫియా
- ఇల్లెందు-కొత్తగూడెం రోడ్డులో అటవీ అధికారులపై ట్రాక్టర్‌తో దాడి
- త్రుటిలో తప్పించుకున్న అధికారులు.. ధ్వంసమైన వాహనం
- రాజకీయ అండతో రెచ్చిపోతున్న కేటుగాళ్లు

ఇల్లెందు, జనవరి 9: ఏజెన్సీ ప్రాంతాల నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా దందా సాగిస్తున్న స్మగర్లు ఏకంగా అడ్డొచ్చే అధికారులపైనే దాడులకు దిగుతూ సవాల్ విసురుతున్నారు. ఇల్లెందు-కొత్తగూడెం మార్గంలో రాత్రివేళలో భారీగా ఇసుక అక్రమంగా లారీలు, ట్రాక్టర్లలో తరలిస్తున్న సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు గత నాలుగు రోజులుగా ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున ఇల్లెందు ఎఫ్‌డీవో కర్నావత్ వెంకన్ననాయక్ ఆధ్వర్యంలో రేంజ్ అధికారి విజయ్‌కుమార్, సిబ్బంది మూనిరాజు, రంగ్యా తదితర పదిమంది అటవీ సిబ్బంది ఇల్లెందు-టేకులపల్లి మధ్య రోళ్లపాడు క్రాస్‌రోడ్డు సమీపంలోని అటవీప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో టేకులపల్లి మండలం నుంచి ఆరు ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా అధికారులు వాటిని అడ్డుకునేందుకు యత్నించారు. ఈ క్రమంలో ముందుగా వచ్చిన రెండు ట్రాక్టర్లను నిలిపి విచారిస్తుండగా అధికారులను గమనించిన అక్రమార్కులు మరో నాలుగు ఇసుక ట్రాక్టర్లను మార్గమధ్యలోనే వెనక్కి తీసుకొని అటవీ సిబ్బందికి చిక్కకుండా తప్పించుకొని ట్రాక్టర్లతో సహా పరారయ్యారు. కాగా తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులకు చిక్కిన రెండు ఇసుక ట్రాక్టర్లలో ఒక ట్రాక్టర్ డ్రైవర్ ట్రాక్టర్‌ను స్పీడుగా రివర్స్ తీస్తూ అటవీ అధికారులను ఢీకొట్టేందుకు యత్నించాడు. ఈ ఘటనలో అధికారులు సురక్షితంగా తప్పించుకోగా, అధికారులకు చెందిన వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొట్టింది. దాంతో వారి కారు ధ్వంసం కాగా అప్రమత్తమైన అధికారులు ఇసు తరలిస్తున్న టేకులపల్లి మండలం బొమ్మనపల్లి గ్రామానికి చెందిన గుగులోత్ హతీరాం, రమేష్ అనేవారిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి ఇల్లెందు కలప డిపోనకు తరలించామని, ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్‌డీవో వెంకన్న తెలిపారు.


అక్రమార్కుల దాడిలో ధ్వంసమైన వాహనం.. ప్రాణాలు కాపాడుకున్న అటవీ అధికారులు

దాడులకు తెగబడుతున్న ఇసుక అక్రమార్కులు

భద్రాచలం, టేకులపల్లి ప్రాంతంలోని గోదావరి, ముర్రేడు, కిన్నెరసాని నదుల నుంచి ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్న మాఫియా ముఠాలు ఇసుక అక్రమరవాణా చేసే క్రమంలో అడ్డువచ్చినవారిపై దాడులకు సైతం వెనుకాడట్లేదు. లారీలు, టిప్పర్‌లు, ట్రాక్టర్ల ద్వారా నిత్యం భారీగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాదారులు గత కొద్దినెలలుగా కొందరు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల అండదండలతో ఇసుక దందాలు సాగిస్తున్నారు. మార్గమధ్యంలో పోలీసులు, అటవీ సిబ్బందికి రాత్రివేళల్లో సంచారించే కొందరు విలేకరులకు డబ్బులు వెదజల్లుతూ యాథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం. కంచే చేనుమేసిన చందంగా ఇసుక రవాణాలను నిరోదించాల్సిన అటవీ, పోలీసు సిబ్బందిలో కొందిరితో పాటు మరి కొందరు విలేకరులు ఇసుక మాఫియాతో కుమ్మక్కై వారి దందాకు సహకరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇల్లెందు, టేకులపల్లి, ఖమ్మంలాంటి పట్టణాలకు అక్రమంగా ట్రాక్టర్లు, టిప్పర్లతో రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ఇల్లెందు, ఖమ్మం, కొత్తగూడెం పట్టణాలకు ఒకొక్క ట్రాక్టర్ ఇసుక రూ.5నుంచి రూ.7వేలకు లారీలు, టిప్పర్ల ద్వారా తరలించి ఆయా ప్రాంతాల్లో రూ.40నుంచి రూ.60వేలకు అమ్మకాలు చేస్తున్నారు. ఈ క్రమంలో డబ్బులకు లొంగనివారిపై బెదిరింపులకు సైతం పాల్పడుతున్నట్లు సమాచారం. భారీ వాహనాలతో ఇసుక తరలిస్తుండడంతో తమ గ్రామాల రాహదారులు ధ్వంసమవుతున్నాయని ప్రశ్నించిన వారినిసైతం బెదిరించడం, దాడులకు పాల్పడుతున్నట్లు తెలిసింది. అయితే కొందరు మినరల్ డెవలప్ కార్పొరేషన్‌కు డబ్బులు డీడీల రూపంలో చెల్లించి, లారీలు, టిప్పర్ల ద్వారా హైదరాబాద్, వరంగల్, ఖమ్మం లాంటి నగరాలకు ఇసుక తరలిస్తుండగా వీటిలో అత్యధికంగా జీరో రవాణా వాహనాలే ఉన్నట్లు సమాచారం. గుండాల, ఆళ్లపల్లి, టేకులపల్లి మండలాలోని కిన్నెరసాని, ముర్రేడు నదులలో ఇసుక మాఫియా ఏకంగా ఎక్స్‌కవేటర్‌లతో రాత్రివేళల్లో ట్రాక్టర్లు, టిప్పర్‌లలో ఇసుక నింపి తరలిస్తున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. ప్రధానంగా టేకులపల్లి మండలానికి చెందిన కొందరు వ్యక్తులు భారీగా ఇసుక దందా సాగిస్తున్నారు. వీరికి స్థానిక రాజకీయ నాయకుల అండదండాలు ఉండడం గమనార్హం. అటవీ, పోలీసు సిబ్బందికి మాముళ్లు ముట్టజేప్పుతూ ఇసుక అక్రమరవాణాను యథేచ్ఛగా సాగిస్తున్నరని ఆరోపణలున్నాయి. ఈ దందాలో శివ అనే వ్యక్తి రాజకీయ అండదండాలతో కీలకపాత్ర పోషిస్తున్నట్లు తెలిసింది. అడపదడపా ఇసుక వాహనాలు పట్టుబడిన సందర్భాల్లో అధికారులు జరిమానాలు విధిస్తూ వదిలేస్తుండడంతో ఇదే అదునుగా భావిస్తున్న ఇసుక మాఫియా అక్రమ రవాణాలకు అడ్డువస్తే ట్రాక్టర్లతో ఢీకొట్టి మరీ ఇసుకను తీసుకెళ్లేందుకు సైతం సిద్ధపడుతున్నట్లు రోళ్లపాడు ఘటనతో రుజువైంది.


ఇసుక రవాణా చేస్తూ పట్టుబడ్డ ట్రాక్టర్లు

ఒక్కో నియోజకవర్గానికి

రూ.10కోట్లు

- అభివృద్ధికి నిధులు ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి
- మంత్రులు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలతో హైదరాబాద్‌లో భేటీ
- సమస్యలపై చర్చ.. లోక్‌సభ ఎన్నికలకు సిద్ధం కావాలని సూచన



ఖమ్మం, జనవరి 9 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి పథకం కింద ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలకు ఒక్కొక్కరికి రూ.10కోట్ల నిధులను కేటాయిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లో ఉమ్మడిజిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితోపాటు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. జిల్లా అభివృద్ధిపై సమీక్షించిన సీఎం ఎమ్మెల్యేలతో మాట్లాడి నియోజకవర్గాల వారీగా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో సీతారామ సాగునీటి ప్రాజెక్టు, జాతీయ రహదారుల నిర్మాణ పనులతోపాటు ఉమ్మడిజిల్లాకు చెందిన పలుసమస్యలు చర్చకు వచ్చాయి. ఆగిపోయిన అభివృద్ధి పనుల గురించి ఆరా తీసిన ముఖ్యమంత్రి ఎమ్మెల్యేల ద్వారా కారణాలు తెలుసుకున్నారు. జిల్లాలో సీతారామ సాగునీటి ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తిచేయాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం నిధులు కేటాయింపులు జరగాలని ప్రజాప్రతినిధులు సూచించారు. అలాగే లోక్‌సభ ఎన్నికలు రాబోతున్నందున ఇప్పటికే సన్నద్ధం కావాలని పార్టీనాయకులు, కార్యకర్తలతో సమావేశాలు సాగించాలని అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే లోక్‌సభ ఎన్నికల ఫలితాలుండాలని ముఖ్యమంత్రి జిల్లా నేతలతో ప్రస్తావించారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణపై కూడా చర్చించారు. అలాగే మేడారం జాతరను పురస్కరించుకుని జిల్లాలో కూడా రహదారుల మరమ్మతులు, భక్తులకు ప్రయాణ, ఇతర సౌకర్యాలు, తీసుకోవాల్సిన చర్యల గురించి ఈ సమావేశంలో చర్చించినట్టు సమాచారం.


రైతు ప్రతినిధులతో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

భూసారం మేరకే పంటలు వేసుకోవాలి

- మల్టీలేయర్ క్రాపింగ్‌తో స్థిరమైన ఆదాయం
- రైతు ప్రతినిధులతో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల

ఖమ్మం వ్యవసాయం, జనవరి 9: భూసారాన్ని బట్టే పంటలు వేయాలని, ఆదిశగా రైతుల్లో అవగాహన పెంచాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన రైతు ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతుబంధు అమలు, ధరణి పోర్టల్ సమస్యలు, పామాయిల్ రైతులకు హెల్త్‌కార్డులు, రుణమాఫీ, కౌలురైతులకు పెట్టుబడిసాయం, కల్తీ విత్తనాలు, రసాయన ఎరువుల నియంత్రణ, సేంద్రియ ఎరువుల వాడకం, బహుళ వ్యవసాయపద్ధతులు, డ్రిప్ విధానంలో పంటలసాగు, ఉత్పత్తుల ప్రాసెసింగ్, శీతల గిడ్డంగులు తదితర అంశాలపై వారితో చర్చించారు. భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగుచేస్తే రసాయనిక ఎరువుల వాడకాన్ని నియంత్రించొచ్చని, ఫలితంగా భూసార పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. అలాగే మల్టీలేయర్ క్రాపింగ్ ద్వారా స్థిరమైన ఆదాయం ఏడాది పొడవునా లభించే అవకాశం రైతులకు ఉంటుందని ఆ పద్ధతులను ప్రవేశపెట్టాలని రైతు ప్రతినిధులు మంత్రిని కోరారు. మార్కెట్‌లో రైతులకు అన్యాయం జరగకుండా కనీస మద్దతు ధర దక్కేలా చూడాలన్నారు. పంటల ఉత్పత్తులకు అదనపు విలువలు చేకూరేలా ప్రాసెసింగ్ అవసరమైన శీతల గిడ్డంగుల వసతి అవసరమైన రీతిలో కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో జాతీయ కిసాన్‌సెల్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, రైతుబంధు సమితి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావు, కిసాన్‌సెల్ తెలంగాణ అధ్యక్షుడు అవినాష్‌రెడ్డి, భూముల సమస్యల న్యాయసలహాదారు ప్రొఫెసర్ సునిల్, చేనేత సొసైటీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, రైతు నేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ వై.వెంకటేశ్వరరావు, వ్యవసాయశాస్త్రవేత్త అల్లాస్ జానయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఏబీఎల్ పొందిన రామవరం ఎంసీహెచ్

అభినందించిన కలెక్టర్ ప్రియాంక అల



రామవరం ఎంసీహెచ్ బృందాన్ని అభినందిస్తున్న భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక అలా..

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జనవరి 9: కొత్తగూడెం సర్వజన ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలోని రామవరం మాతా, శిశు ఆరోగ్య కేంద్రాన్ని ఐటీసీ సంస్థ తొలిసారిగా గుర్తించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే ఐటీసీ సెంటర్ నేషనల్ అక్రిడేషన్ బోర్డ్ ఆఫ్ టెస్టింగ్ అండ్ కొలెబ్రేషన్ లేబరేటరీస్(ఎన్‌ఏబీఎల్) పొందడం గర్వంగా ఉందని కలెక్టర్ ప్రియాంక అల హర్షం వ్యక్తం చేశారు. ఈ గుర్తింపునకు కృషి చేసిన ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ బోడ కుమారస్వామిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఎంవో వసంత్‌కుమార్, సిబ్బంది టెక్నీషియన్ జ్యోతి, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పామాయిల్ గెలలకు

పాత ధరే..

చెల్లింపులపై ఉద్యానశాఖ ఉత్తర్వులు

అశ్వారావుపేట, జనవరి 9: ఆయిల్‌పామ్ ధర నిర్ణయంపై ఇంకా జీవో రాలేదని, నవంబరు, డిసెంబరు నెలలకు సంబంధించి పాతధర ప్రకారమే రైతులకు చెల్లింపులు చేయాలని ఉద్యానశాఖ ఉత్తర్వులు జారీ చేసిందని టీఎస్ ఆయిల్ పామ్ రాష్ట్ర రైతుసంఘం అధ్యక్షుడు ఆలపాటి ప్రసాదరావు వెల్లడించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఉద్యానశాఖ నుంచి జారీ అయిన జీవో పత్రికలకు విడుదల చేశారు. నవంబరులో జరగాల్సిన ఆయిల్‌పామ్ ధర నిర్ణాయక సమావేశం ఎన్నికల కారణంగా జనవరిలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయిల్ రికవరీశాతం19.02గా కమిటీ నిర్ణయించింది. గతేడాది 19.32శాతంగా ఉన్న రికవరీశాతం ఈ ఏడాది తగ్గడంతో తెలంగాణ ఆయిల్‌పామ్ రైతు సంఘం ఆధ్వర్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును, ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందనరావును కలిసి రికవరీశాతం తగ్గటంతో రైతులు నష్టపోతారని, ఆ మేరకు గెలల రవాణా చార్జీలను పెంచాలని లేఖ ను ఇచ్చామని ఆయన తెలిపారు. లేఖపై స్పందించిన ప్రిన్సిపల్ సెక్రటరీ కొత్తగా నిర్ణయమైన ధరల జీవోను నిలుపుదల చేశారు. కొత్త జీవో అమలుల్లోకి రానందున నవంబరు నెలకు టన్ను ఒక్కంటికి రూ.12,619, డిసెంబరు నెల ధర రూ.12,627 చొప్పున రైతులకు చెల్లించాలని ఉద్యానశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్టు ఆయన తెలిపారు.ఈ ఉత్తర్వులను విడుదల చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉద్యానశాఖ అధికారులు, ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందరావుకు రైతుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. రవాణ చార్జీలను పెంచిన తరువాత కొత్త జీఓను విడుదల చేస్తారనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

ఖమ్మం లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా నామ!

- హైదరాబాద్‌లో పార్టీ జిల్లా నేతల ప్రతిపాదన
- సమావేశానికి హాజరైన కేటీఆర్, హరీష్‌రావు
- అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై సమీక్ష
- చంద్రబాబు అరెస్టు ప్రభావం పడిందని నేతల అభిప్రాయం


మాట్లాడుతున్న కేటీఆర్

ఖమ్మం, జనవరి 9 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం బీఆర్‌ఎస్ అభ్యర్థిగా నామ నాగేశ్వరరావును మరోసారి బరిలో దించాలని జిల్లా నేతలు ప్రతిపాదించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి అనంతరం హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గస్థాయి సమీక్షలో ఖమ్మం లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నాయకులు, పార్టీ సంస్థాగత కమిటీలు, మాజీ ఎమ్మెల్యేలు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. మాజీమంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీష్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్ హాజరైన ఈ సమావేశంలో ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడిఖమ్మం జిల్లాలో పార్టీ ఓటమికి గల కారణాలపై విశ్లేషించారు. ఈ క్రమంలో టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టు ప్రభావం జిల్లా ఎన్నికలపై చూపించిందని కొందరు నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఏదేమైనా లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించేందుకు సమష్టిగా పనిచేద్దామని, ప్రతిపక్ష హోదాలో అధికారపక్షం ఇచ్చిన హామీల అమలుపై పోరాటం సాగిద్దామని నిర్ణయించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా.. ప్రస్తుత ఎంపీ బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్షనేత నామ నాగేశ్వరరావును పోటీ చేయించాలని ప్రతిపాదించారు. మంగళవారం హైదరాబాదులో జరిగిన సమీక్షలో కూడా నేతలంతా నామ వైపే మొగ్గుచూపడంతోపాటు ఆయన విజయం కోసం కలిసికట్టుగా పనిచేస్తామని ప్రకటించారు. సిట్టింగ్ ఎంపీగా బీఆర్‌ఎస్ లోక్‌సభాపక్ష నేతగా నామ నాగేశ్వరరావు సమర్థవంతంగా పనిచేస్తున్నారని, తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి లోక్‌సభలో దేశానికి తెలియచేశారని మాజీమంత్రి పువ్వాడ అజయ్ కుమార్, రాజ్యసభసభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ప్రస్తావించారు. గతంలోనూ ఒక్కచోట మాత్రమే గెలిచినా లోక్‌సభలో మాత్రం నామ నాగేశ్వరరావు భారీ మెజారిటీతో విజయం సాధించారని అదే ఫలితం వచ్చే ఎన్నికల్లోనూ ఉంటుందన్నారు. అలాగే కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌కు ముందుగానే అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ లోక్‌సభాపక్షనేత, ఎంపీ నామ నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారధిరెడ్డి, ఖమ్మం జడ్పీచైర్మన్ లింగాలకమల్‌రాజ్,డీసీసీబీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర, వనమా, రేగా, కందాల, మెచ్చా, బానోతు మదన్‌లాల్, విత్తనాభివృద్ధి సంస్థ మాజీచైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ పాల్గొన్నారు.

తీరు మారేనా?

- ఏడాదిన్నర తరువాత ఐటీడీఏ అధికారుల నోట 'పాలకమండలి'
- వచ్చేనెల మొదటివారంలో సమావేశం నిర్వహిస్తామని ప్రకటన
- ఈ సారైనా సమగ్ర చర్చ జరగాలంటున్న ఆదివాసీలు



భద్రాచలం, జనవరి 9: ఉమ్మడి రాష్ట్రంలోనే ఎంతో కీలకమైన భద్రాచలం ఐటీడీఏ తీరు ఎప్పుడు మారుతుందని గిరిజన సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి ఐటీడీఏ పాలక మండలి సమావేశం మూడు నెలలు లేదా కనీసం ఆరు నెలలకు ఒకసారి తప్పనిసరిగా నిర్వహించాలని గతంలో కేంద్ర మంత్రిగా పని చేసిన జూయల్ ఓరం ఆదేశించారు. జిల్లాలోని 23 మండలాలు ఏజెన్సీ పరిధిలోకి రావడం, విద్య, వైద్య తాగు, సాగునీటి రహదారులు తదితర సమస్యల పరిష్కారానికి పాలకమండలి సమావేశం ఎంతో కీలకమైనా అధికారులు నిబద్ధతతో పాలకమండలి సమావేశం నిర్వహించేందుకు చొరవ తీసుకోవడం లేదనే విమర్శలు ఏజెన్సీవాసుల నుంచి వినిపిస్తున్నాయి. ఎప్పుడూ మొక్కుబడిగా సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. కానీ ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వహయాంలో పాలకమండలి సమావేశాల నిర్వహణ అంతంత మాత్రంగానే సాగింది. అప్పటి మంత్రులు, ఉన్నతాధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించిన దాఖలాలు లేవనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన క్రమంలో ఐటీడీ పాలకమండలి సమావేశం నిర్వహణపై కదలిక వచ్చింది. ఈసారి ఫిబ్రవరి మొదటివారంలో సమావేశం నిర్వహించే అవకాశాలు ఉన్నట్లు ఐటీడీఏ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతానికి నిర్వహణ తేదీపై స్పష్టత లేకపోయినా సమావేశం మొదటి వారంలో జరుగుతుందని అధికారవర్గాల ద్వారా తెలుస్తోంది.

సుదీర్ఘ విరామం తరువాత..

భద్రాచలం ఐటీడీఏ పాలకమండలి సమావేశం నిర్వహణపై ఐటీడీఏ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. 18 నెలల అనంతరం ఐటీడీఏ అధికారుల నోట పాలకమండలి సమావేశ నిర్వహణ ప్రస్తావనకు రావడంతో గిరిజన ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల నాయకులు హర్షాతిరేకం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సమావేశం నిర్వహణకు కదలికరావడం ఆహ్వానించదగ్గ పరిణామమని వారు పేర్కొంటున్నారు. చివరిసారిగా 2022 జూలై 8న ఐటీడీఏ పాలకమండలి సమావేశం జరిగింది. ఆనాడు అప్పటి రవాణశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా, అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

'పది'కి పక్కా ప్రణాళిక

- ఉత్తమ ఫలితాల సాధనకు సర్కారు బడుల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- పరీక్షలకు సన్నద్ధం చేస్తున్న ఉపాధ్యాయులు


(ఫైల్)

ఖమ్మం ఖానాపురం హవేలీ, జనవరి 9: పదో తరగతి.. విద్యార్థుల భవిష్యత్తుకు తొలిమెట్టు. వారి బంగారు భవిష్యత్‌కు దశ, దిశను నిర్దేశం జరిగేది ఇక్కడే పదోతరగతిలో ప్రతిభ కనబర్చితే విద్యార్థుల భవిష్యత్ బంగారు బాట పడుతుందన్నది అందరికీ తెలసిందే. కానీ విద్యార్థుల జీవితంలో ఎంతో విలువైన ఈ పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడం అంటే అనుకున్నంత సులువు కాదు. దీనిని అధిగమించేందుకు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు వినూత్న తరహాలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉన్నత స్థాయి ఫలితాలు సాధించేలా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఒక ప్రణాళికలను సిద్ధం చేసుకొని ముందుకు సాగుతున్నారు.

ప్రణాళికను పాటిస్తే ఉత్తమ ఫలితాలు..

జిల్లాలోని 282 ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు మొత్తం 10,146 ఉన్నాయి. వారిలో బాలురు 4,861, బాలికలు 5,285 మంది ఉన్నారు. ఆరేళ్లుగా పదో తరగతి పరీక్ష విధానంలో మార్పులు చోటుచేసుకున్నాయి. పదో తరగతి విద్యార్థులకు 20 మార్కులు ఇంటర్నల్ కాగా, 80 మార్కులకు రాత పరీక్షలు ఉంటాయి. సీసీఈ ప్రశ్నావళి విధానంతో పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నందున వీటిని దృష్టిలో పెట్టుకుని ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు.

ముందుగానే అవగాహన..

పదో తరగతి పరీక్షల ఎలా రాయాలి, ఎలా సిద్ధం కావాలి అనేదాని కోసం విద్యార్థులకు పాఠశాలల్లో ముందగానే అవగాహన కల్పిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల స్థాయిలో ఉదయం, సాయంత్రం అదనంగా ఒక గంట పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఎలా చదవాలి, ఎక్కువ మార్కులు ఎలా తెచ్చుకోవాలి లాంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. రోజుకో పరీక్ష నిర్వహించి బిట్ పేపర్‌ను ఎలా రాయాలో సిద్ధం చేయిస్తున్నారు. విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు.

ఫలితాల్లో ముందంజ..

గతేడాది పదో తరగతి ఫలితాల్లో చాలా ప్రభుత్వ పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు పలువురు విద్యార్థులు 10 జీపీఏ సాధించి సత్తా చాటారు. మోడల్, టీటీడబ్ల్యూఆర్, పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో 10, 9 జీపీఏ సాధించి ముందంజలో నిలిచారు. ఈ ఏడాది కూడా 10జీపీఏ సాధించడమే లక్ష్యంగా శ్రమిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తెలుపుతున్నారు.

10 జీపీఏ లక్ష్యం

సోమశేఖర శర్మ, ఖమ్మం జిల్లా విద్యాశాఖ అధికారి

ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు 10 జీపీఏ సాధించడమే లక్ష్యంగా ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. రోజు వారీగా సబ్జెక్ట్ స్టడీ అవర్స్ నిర్వహిస్తూ విద్యార్థుల సందేహాలను తీర్చుతున్నాం. ఎలా రాస్తే మార్కులు ఎక్కువగా వస్తాయి, ఎలా చదవాలి అనే అంశాలను వివరిస్తూ పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం. నూరు శాతం ఉత్తీర్ణత, 10 జీపీఏలు ఎక్కువగా సాధించేందుకు ఉపాధ్యాయుల సహకారంతో ముందుకెళ్తున్నాం. గతేడాది కంటే మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నాం.

ఎకరం 80లక్షలు..!

- ధరణిలో అధిక మొత్తంగా మార్కెట్ విలువ నమోదు.. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఇబ్బందులు
- సరిచేయాలంటున్న బాధిత రైతులు



సుబాబుల్ సాగుచేసిన తన భూమిలో రైతు సామినేని వెంకటరామారావు

వైరా, జనవరి 9: వైరాకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న సోమవరం రెవెన్యూ గ్రామంలోని కొన్ని సర్వేనెంబర్లలో ఉన్న భూముల విలువ ఆకాశాన్ని తాకుతున్నాయి. దాంతో ఆగ్రామంలోని బాధిత రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టిన ప్రజావాణిలో కూడా ఈ గ్రామ రైతు ఒకరు తన గోడును వెలిబుచ్చుతూ ఫిర్యాదు చేశారు. సోమవరం రెవెన్యూ పరిధిలో సోమవరం, వైరా, గండగలపాడు, స్నానాల లక్ష్మీపురం గ్రామ భూములున్నాయి. వైరాలో సైతం లేని భూమి మార్కెట్ విలువ సోమవరం గ్రామంలోని కొన్ని సర్వేనెంబర్లలో ఉండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సోమవారం గ్రామ సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి రెండు రాష్ట్రాలకు కీలకమైన అంతర్రాష్ట్ర రోడ్డు పక్కనున్న భూములకు కూడా ప్రభుత్వం ఎకరాకు రూ.28.20లక్షలు(రెండేళ్ల వడ్డీతో కలిపి) చెల్లించింది. వైరా-జగ్గయ్యపేట అంతర్రాష్ట్ర రహదారికి కిలోమీటరు దూరంలో కొన్ని సర్వేనెంబర్లలోని భూములకు మార్కెట్ విలువ రూ.81,31,500గా ఉండటంతో రైతులు అవాక్కవుతున్నారు. 2015లో ఈ సర్వేనెంబర్లలోని మార్కెట్ విలువ కేవలం రూ.2.50లక్షలు మాత్రమే కాగా అవి ఇప్పుడు రూ.81,31,500గా ఉండటంతో సంబంధిత రైతులు నిర్ఘాంతపోతున్నారు. తమ భూములకు సంబంధించి అధికారులు చేసిన పొరపాట్లను సరిదిద్దాలని కోరుతూ రైతులు జిల్లా కలెక్టర్, ఇతర అధికారుల చుట్టూ ఏడాది నుంచి చెప్పులరిగేలా తిరుగుతున్నారు. అయినప్పటికీ ఇంతవరకు పరిష్కార మార్గం లభించలేదు.

సోమవరం గ్రామానికి చెందిన రైతు సామినేని వెంకటరామారావుకు సర్వేనెంబర్ 1240/అ/4లో 3.38 ఎకరాలు, సర్వేనెంబర్ 1240/అ/5/2లో 1.16ఎకరాలు, సర్వేనెంబర్ 1240/అ/5/1లో ఒక ఎకరం మొత్తంగా 6.14ఎకరాల భూమి ఉంది. ఈ సర్వేనెంబర్లలో ఇతరులకు చెందిన మరో 23ఎకరాల భూములు కూడా ఉన్నాయి. కొద్దిరోజుల కిందట వెంకటరామారావు తన పేరుమీద ఉన్న భూమిని వాటా కింద కుమారుడి పేరుమీద రిజిస్ట్రేషన్ చేయించేందుకు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లగా ఆభూమి మార్కెట్ విలువ ఒక్కసారిగా రూ.81,31,500గా ఉందని రెవెన్యూ అధికారులు చెప్పడంతో ఆయన నిర్ఘాంతపోయారు. ధరణిలో ఈ భూమి విలువ పైన పేర్కొన్న మొత్తంలో ఉందని తెలుసుకున్న రైతు వెంకటరామారావు అప్పటి నుంచి ఖమ్మం కలెక్టర్, అదనపు కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నా సమస్యకు పరిష్కారం లభించలేదు. ఖమ్మం ఆర్డీవో, తహసీల్దార్ క్షేత్రస్థాయిలో భూమిని పరిశీలించి కూడా వెళ్లారు. ఇది జరిగి ఏడాది కావస్తున్నా సమస్య అంతే ఉండటంతో ఆరైతు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తన పిల్లల చదువుల నిమిత్తం ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ కోసం ఆయన తన భూమిని వాటా కింద కుటుంబసభ్యులకు రిజిస్ట్రేషన్ చేయించే సమయంలో తన భూమి మార్కెట్ విలువ బయటపడింది. వైరాలోని భూములకు సైతం లేని మార్కెట్ విలువ రోడ్డుకు దూరంగా వ్యవసాయ భూమిగా ఉన్న తన పొలానికి అంత మార్కెట్ విలువ ఎలా ఉంటుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం రోడ్డుపక్కన ప్రభుత్వం సేకరించిన భూమి మార్కెట్ విలువే ప్రస్తుతం కేవలం రూ.25లక్షలు ఉండగా ఆరోడ్డుకు కిలోమీటర్ దూరంలో ఉన్న భూమికి రూ.81.31లక్షల విలువ ఎలా ఉంటుందని ఆరైతులు ప్రశ్నిస్తున్నారు. ఇదే గ్రామంలోని సర్వేనెంబర్ 1183లో ఉన్న అసైన్‌మెంట్ భూములకు కూడా రూ.80 లక్షల మార్కెట్ విలువ ఉండటం విశేషం. మరికొన్ని సర్వేనెంబర్లలోని భూము లకు సైతం ఎకరం ఒక్కింటికి రూ.63లక్షల పైచిలుకు మార్కెట్ విలువ కట్టడం పట్ల ఆరైతులు ఆశ్చర్యపోతున్నారు. ఈ గ్రామంలోని ఇతర సర్వే నెంబర్ల భూములకు కేవలం రూ.5లక్షలనుంచి రూ.6లక్షల మేరకే మార్కెట్ విలువ ఉంది. 2015లో కేవలం రూ.2.50లక్షల మార్కెట్ విలువ ఉన్న భూములకు ఇప్పుడు ఒక్కసారిగా రూ.81.30లక్షలకు పెంచి అధికారులు పొరపాట్లు చేశారని వాటిని సరిదిద్దాలని బాధిత రైతులు కోరుతున్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదు చేశా
సామినేని వెంకటరామారావు, బాధిత రైతు

2015లో నా భూమి మార్కెట్ విలువ రూ.2.50లక్షలుగా ఉండగా ఇప్పుడు దాని రూ.81,31,500కు అధికారులు పెంచి ఇబ్బందిపెడుతున్నారు. సమస్య పరిష్కారం కోసం సంవత్సర కాలంగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. నెలరోజుల కిందట రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన ప్రజావాణికి వెళ్లి అక్కడ కూడా ఫిర్యాదు చేశా. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ దృష్టికి కూడా మా సమస్య తీసుకువెళ్లాను. మార్కెట్ విలువ సరిచేయాలని కోరుతూ ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్‌కు ఒక లేఖ రాశారు. ఇప్పటికైనా ప్రజావాణిలోని తన ఫిర్యాదును, ఎమ్మెల్యే రాసిన లేఖను, తాను చేసిన విజ్ఞప్తులను పరిశీలించి తన సమస్యను పరిష్కరించాలని రైతు వెంకటరామారావు కోరారు.

పాలేరులో నేడు మంత్రి పొంగులేటి పర్యటన

- క్యాంపు కార్యాలయంలోకి అధికారికంగా ప్రవేశం
- ఏర్పాట్లు చేసిన అధికారులు
- 10 వేల మంది కాంగ్రెస్ శ్రేణులు హాజరయ్యే అవకాశం



క్యాంపుకార్యాలయంలో ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

కూసుమంచి, జనవరి 9: రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం పాలేరు నియోజకవర్గంలో ప్రవేశించనున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. అధికారికంగా కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలోకి ప్రవేశించనున్నారు. ఈమేరకు అధికార యంత్రాంగం మంత్రి పర్యటనకు ఏర్పాట్లు చేసింది. సుమారు పదివేల మంది పార్టీ శ్రేణులు పాల్గొననున్నట్లు అంచనావేశారు. బుధవారం ఉదయం 10గంటలకు భక్తరామదాసు కళాక్షేత్రంలో ఆత్మీయ అభినందన వేడుకల్లో పాల్గొంటారు. ఉదయం 11 గంటలకు ఖమ్మంరూరల్ మండలం మల్లెమడుగులో, 11:30కు ఏదులాపురంలో, 12గంటలకు కొండాపురంలో నూతనంగా నిర్మించిన హెల్త్‌సెంటర్లను ప్రారంభిస్తారు.

కూసుమంచిలో క్యాంపుకార్యాలయంలోకి ప్రవేశం

కూసుమంచిలోని పాలేరు నియోజకవర్గం క్యాంపుకార్యాలయంలోకి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారికంగా ప్రవేశించనున్నారు. ఇటీవల క్యాంపుకార్యాలయాన్ని సర్వాంగ సుందరంగా తయారు చేశారు. మధ్యాహ్నం 12:30 గంటలనుంచి సాయంత్రం 5గంటల వరకు మంత్రి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అభిమానులను కలువనున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తనను అధిక మెజారిటీతో గెలిపించినందుకు ఈవేదిక ద్వారా కృతజ్ఞతలు తెలుపనున్నారు. నియోజకవర్గం నుంచి సుమారు 15వేలమంది హాజరవుతారని అంచనావేస్తున్నారు. వచ్చిన ప్రతిఒక్కరికి భోజన ఏర్పాట్లు చేశారు. మంత్రి పర్యటన పురస్కరించుకుని అధికారులు ఏర్పాట్లు చేశారు. వాహనాల పార్కింగ్, భోజనాలకు తగిన ఏర్పాట్లు చేశారు.

మంత్రి పొంగులేటి పర్యటన వివరాలు..

ఖమ్మం సంక్షేమవిభాగం, జనవరి9: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం,సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు మంగళవారం క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. ఖమ్మంతో పాటుగా మల్లెమడుగు, ఏదులాపురం, కొండాపురంలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారన్నారు. సాయంత్రం వరకు కూసుమంచిలోని పాలేరు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో అందుబాటులో ఉంటారని తెలిపారు.

భద్రాద్రి దేవస్థానం హరిదాసు సత్యనారాయణ కన్నుమూత



భద్రాచలం, జనవరి 9: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆస్థాన హరిదాసుగా బాధ్యతలు నిర్వహిస్తున్న సీహెచ్ సత్యనారాయణ(68) అనారోగ్యంతో కన్నుమూశారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన్ను కుమార్తె భద్రాచలం నుంచి ఏపీలోని మచిలీపట్నంకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఆయన సోమవారం అర్ధరాత్రి మృతిచెందారు. దశాబ్దంన్నర కాలంగా రామాలయంలో స్వామి వారికి నిర్వహించే దర్బారు సేవ ఇతర సేవల్లో ఆయన హరిదాసుగా తన గాత్రంతో భక్తరామదాసు తూము నరసింహదాసు కీర్తనలను ఆలపించారు. హరిదాసు సత్యనారాయణ మృతి విషయం తెలుసుకున్న భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, పరిపాలన వైదిక సిబ్బంది ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. దేవస్థానం తరపున స్వామి వారి శేషవస్త్రం, శేష మాలికతో పాటు వైదిక పరిపాలన సిబ్బందిని దేవస్థానం తరపున హరిదాసు సత్యనారాయణకు నివాళ్లర్పించేందుకు మచిలీపట్నం పంపారు. దేవస్థానం తరపున ఆర్థిక సహాయం అందజేశారు. హరిదాసు సత్యనారాయణ మృతి పట్ల దేవస్థానం ఉద్యోగుల సంక్షేమ సంఘం, రామ భక్తులు సంతాపం తెలిపారు.

ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాం

- కిష్టారం ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ నరసింహారావు

సత్తుపల్లి, జనవరి 9 కిష్టారంలో ఓసీలో 2023-2024 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన 20 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని ఈనెల 8వతేది నాటికే అధిక మించినట్లు కిష్టారం ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎంవీ నరసింహారావు తెలిపారు. మంగళవారం ఉద్యోగులతో ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరానికి 83 రోజులు ముందుగానే ఉద్యోగులు లక్ష్యాన్ని అధిగమించారని వివరించారు. తగిన రక్షణ చర్యలు, సూచనలు అందించిన కొత్తగూడెం ఏరియా జీఎం పాలెం రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఆర్థిక సంత్సరంలో మిగిలిన 83 రోజులూ మెరుగైన ఉత్పత్తి సాధించి కంపెనీ పురోభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఇంజనీర్ రమణారావు, కాలరి మేనేజర్ రామకృష్ణ, రక్షణ అధికారి గోపికిశోర్, ఏఐటీయూసీ సెక్రటరీ కిషోర్, ప్రాతినిధ్యం యూనియన్ ఐఎన్‌టీయూసీ పిట్ సెక్రటరీ బాలాజీ, వెల్ఫేర్ ఆఫీసర్ సందీప్ పాల్గొన్నారు.

విజయ డెయిరీలో ప్రక్షాళన జరిగేనా?

ఖమ్మం కార్పొరేషన్, జనవరి9: ఇకనైపు విజయ డెయిరీని అభివృద్ధి చేయాలని డెయిరీ డీడీతో సహా ఉన్నతాధికారులు కృసి చేస్తుంటే కొంతమంది ఉద్యోగులు చేస్తున్న అక్రమాలతో డెయిరీ ఆర్థికంగా నష్టపోతున్నది. డెయిరీలో జరుగుతున్న అక్రమాలపై పాడిరైతు సమాఖ్య జిల్లా డైరెక్టర్ ఇమ్మడి శ్రీనివాసరావు, కోటగిరి నాగేశ్వరరావు, గోగుల రవీందర్‌రావు, ఉల్లి సునీల్‌కుమార్ తదితరులు సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణా పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ ఎండీ చిట్టెం లక్ష్మిని కలుసుకొని విజయ డెయిరీలో జరుగుతున్న అక్రమాలను వినతిపత్రం అందజేసి వివరించారు. త్వరలోనే ఖమ్మం విజయ డెయిరీలో సమావేశం నిర్వహిస్తా మని, అక్రమాలు చేసే ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని ఎండీ హామీ ఇవ్వటంతో విజయ డెయిరీలో ప్రక్షాళన జరిగేనా? అని పాడిరైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఒక వైపు అభివృద్ధి.. మరోవైపు అవినీతి

పాలసేకరణ పెరుగుతూ ఒక వైపు అభివృద్ధి జరుగుతుండగా మరోవైపు కొందరు ఉద్యోగులు అవినీతికి పాల్పడుతున్నారు. ముఖ్యంగా ల్యాబ్‌లో పనిచేసే ఉద్యోగులు, మేనేజర్, సహాయ మేనేజర్ స్థాయిలో ఉన్న

ఎండీని కలిసిన పాడిరైతులు



ఎండీకి వినతిపత్రం ఇస్తున్న పాడిరైతులు

అవినీతికి పాల్పడటంతో పాడిరైతులతో పాటు డెయిరీ ఆర్థికంగా నష్టపోతున్నది. గతంలో పడుతూ, లేస్తూ సాగుతున్న విజయ డెయిరీ డీడీ కుమారస్వామి కృషితో రోజుకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సుమారు 15వేల లీటర్ల పాలు సేకరించే స్థాయికి ఎదిగింది. అయితే పాడిరైతులు పోసే పాలలో వెన్నశాతం తగ్గిస్తూ పాడిరైతులను ఆర్థికంగా దోచుకుంటున్నారని పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ ఎండీకి పాడిరైతులు ఫిర్యాదు చేశారు. రైతులకు అనుమానం రాకుండా కేవలం 0.5శాతం వెన్నను తగ్గించి చూపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనివల్ల పాడిరైతులకు లీటరుకు 4రూపాయల ధర తగ్గుతుంది. ఆ మేరకు నీళ్లు కలిపి సొమ్ములను స్వాహా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కాగా గతంలో వెన్నను అక్రమంగా విక్రయించి సుమారు రూ.10లక్షల సొమ్ములు స్వాహా చేశారని అధికారుల తనిఖీలో తేలడంతో ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేశారు. కొత్తగూడెం విజయ డెయిరీలో సహాయ మేనేజర్ బినామీ పేర్లతో పాలసేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి, పాడిరైతుల నుండి సేకరించిన పాలను తగ్గించి చూపించి, తన బినామీ కేంద్రాల్లో పాలసేకరణ జరిగినట్లు చూపి రూ.10లక్షలు స్వాహా చేయటంతో సదరు ఉద్యోగిని సస్పెండ్ చేశారు.

పాల సరఫరాకు ఏజెన్సీ ఏర్పాటు

ఖమ్మం విజయడెయిరీ పరిధిలో పాలసరఫరాకు నూతన ఏజెన్సీని పాడిపరిశ్రమాభివృద్ధి సంస్థ ఎండీ చిట్టెం లక్ష్మి నియమించారు. ఇంతవరకు టెండర్ పొందిన ఏజెన్సీ కాలపరిమితి ముగియటంతో పాల సరఫరా నిలిచిపోయింది. విజయ డెయిరీ ద్వారా సేకరించిన పాలను హైదరాబాద్‌కు పంపాల్సిన పరిస్థితి. అయితే కొత్త ఏజెన్సీని నియమించటంతో ఇకనుంచి విజయపాలు, పెరుగు విక్రయాలు పెరగనున్నాయి.

కోళ్లషెడ్ నుంచి పందెం కోళ్ల చోరీ



షెడ్ మెష్ కత్తిరించిన దృశ్యం

నేలకొండపల్లి, జనవరి 9: నేలకొండపల్లి మండలం కోరట్లగూడెంలో మంగళవారం కోళ్లషెడ్‌లో ఉంచిన పందెం కోళ్లు చోరీకి గురయ్యాయి. గ్రామానికి చెందిన కొమ్మినేని మురళి తనకు తోటలో సంవత్సరం క్రితం షెడ్‌ను వేసి నాటుకోళ్లను పెంచి అమ్ముతున్నాడు. అతడు ఈ షెడ్‌లో పందెం కోళ్లను సైతం పెంచుతున్నాడు. షెడ్‌లో పందెం కోళ్లతో పాటు సుమారు 200కోళ్లు ఉన్నాయి. మంగళవారం ఉదయం యథావిధిగా కోళ్లకు మేత వేసేందుకు మురళీ తండ్రి బాబు షెడ్‌లోకి వెళ్లగా పందెం పుంజులు కనిపించలేదు. షెడ్‌కు ఒకవైపు ఉన్న జాలి మనిషి పట్టే సైజులో కోసి ఉంది. షెడ్‌లో ఉండాల్సిన ఆరు పందెం పుంజులు మాయమయ్యాయి. పుంజులతో పాటుగా సుమారు 20వరకు నాటుకోళ్లు కూడా పోయాయని మురళీ తెలిపాడు. ఒక్కొక్క పుంజు రూ.10వేల వరకు ఉంటుందని, ఇటీవల బేరం వచ్చినా అమ్మలేదని తెలిపాడు. చోరీకి గురైన కోళ్ల విలువ సుమారు రూ.70వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ఈ ఘటనపై నేలకొండపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

పాల్వంచ, జనవరి 9: పేకాటస్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్న ఘటన మంగళవారం పాల్వంచలో జరిగింది. వెంగళరావు కాలనీ శివారు అటవీ ప్రాంతంలో కొంతమంది పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ సీఐ సత్యనారాయణ తన సిబ్బందితో కలిసి స్థావరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న ఏడుగురిని అదులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.33వేల నగదు, ఏడు సెల్‌ఫోన్లు, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకుని పాల్వంచ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ బానాల రాము తెలిపారు. దాడిలో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐలు ప్రవీణ్, సుమన్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పని చేయించుకొని బిల్లు చెల్లించలేదని కలెక్టర్‌కు ఫిర్యాదు

అశ్వారావుపేట, జనవరి 9: ఆర్‌అండ్‌బీ శాఖలో కొన్ని అత్యవసర పనులను టెండర్ పిలువకుండానే పనులు చేసి, ఆ తరువాత వాటిని మంజూరు చేయించుకొని బిల్లులు చేస్తూ ఉంటారు. అందులో భాగంగానే అశ్వారావుపేట మండలం గుమ్మడపల్లికి చెందిన నాగేశ్వరరావు అనే వ్యక్తి పెదవాగు ప్రాజెక్టు వాగుపైన రంగాపురం వెళ్లే రహదారిపై కొట్టుకొని పోయిన రహదారిని అత్యవసరంగా నిర్మించాలని ఆర్‌అండ్‌బీ అధికారుల ఆదేశం మేరకు సుమారుగా రూ.5 లక్షలు రూపాయలు వెచ్చించి రహదారిని నిర్మించారు. కానీ రహదారి పని చేయించిన అధికారులు ఆ తరువాత బిల్లులు మాత్రం చెల్లించలేదు. 2021 సెప్టెంబరు 12న ఆర్‌అండ్‌బీ ఈఈ టెండర్ పిలవకుండానే అత్యవసరంగా ఈ రహదారిని నిర్మించమని ఆదేశించారు. ఆ తరువాత ఆ రహదారికి బిల్లులు చెల్లించకుండా అధికారులు ఇబ్బంది పెడుతున్నారని, ఈ వ్యవహారంలో తనకు న్యాయం చేయాలని సోమవారం కొత్తగూడెంలో జరిగిన గ్రీవన్స్‌డేలో కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశాడు.

ధరణికో దండం !

- రికార్డుల తారుమారుతో ప్రజలకు ఇబ్బందులు
- ఇష్టారాజ్యంగా వారసత్వాల నమోదు
- అనేకచోట్ల వాస్తవ యజమానుల పేర్లు గల్లంతు

అశ్వారావుపేట, జనవరి 8: భూముల రికార్డుల నిర్వహణకు గత ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన ధరణి పోర్టర్‌తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎంతో గొప్పగా తీసుకొచ్చిన ఈ పోర్టర్‌లో వందల ఎకరాల భూములకు సంబంధించిన రికార్డులు తారుమారయ్యాయి. జరిగిన తప్పులను సరిచేసుకునేందుకు యాప్ అనుమతించకపోవడంతో తమ భూమి తమకు కాకుండా పోతుందనే ఆందోళనలో అనేకమంది ఆందోళన చెందుతున్నారు. భద్రాద్రి జిల్లాలో 2018లో భూ రికార్డుల ప్రక్షాళన హడావుడిగా చేపట్టగా ఆ సమయంలో డిజిటల్ పాస్ పుస్తకాలు ఇచ్చే సమయంలో చాలా తప్పులు జరిగాయి. ఒక్క అశ్వారావుపేట మండలంలోనే విస్తీర్ణం నమోదులో తప్పులు, పేర్లుతప్పులు, పాత పాస్ పుస్తకాలలో ఉన్న సర్వే నెంబర్లు కొత్తవాటిలో నమోదు కాకుండా మిస్ అవ్వడం, సరిహద్దులు మారడం, పొటోలు మారడం, ఒకరి పేరుకు బదులు మరొకరి పేరు నమోదు కావడం, విస్తీర్ణం తేడా వంటి తప్పులు వందల సంఖ్యలో జరిగాయి. కొందరికైతే ఒకరి పేరున ఉన్న భూమి వేరొకరి పేరుమీద నమోదైన ఘటనలు కూడా ఉన్నాయి. ఈ తప్పులను సరిచేసుకునేందుకు రైతులు తహసీల్దార్ కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. ఈ సమస్యలు ఇలా ఉండగానే గత ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను తీసుకురావడంతో తప్పులను సరిచేసే అవకాశం లేకుండా పోయింది. సీతారామప్రాజెక్టు కాలువల్లో భూములు కోల్పోయి నష్టపరిహారం పొందిన అనేక మంది లబ్దిదారుల భూములు కోల్పోయిన విస్తీర్ణం కొద్ది మొత్తమే అయితే వాళ్లపేరుతో ఉన్న భూమి మొత్తం రికార్డులనుంచి తొలగించారు. ఈ తప్పులను సరిచేయడానికి ధరణి పోర్టల్ అనుమతించకపోవడంతో నాలుగేళ్లుగా అసలు తమ భూమి తమకు వస్తుందో లేదోనని బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు. ఊట్లపల్లిలో ఓ రైతు ఎకరం భూమి రిజిస్ట్రేషన్ ద్వారా పొందాడు. అందులో అర ఎకరం భూమి సీతారామ కాలువల కింది పోగా ఆ మేరకు నష్టపరిహారం చెల్లించారు. కానీ రికార్డుల్లో మాత్రం అతనికున్న మొత్తం భూమిని తొలగించారు. తిరుమలకుంట, మామిళ్లవారి గూడెం, వినాయకపురం, నారంవారి గూడెం తదితర ప్రాంతాలలో పాస్ పుస్తకాలలో విస్తీర్ణ నమోదులో తప్పులు, ఒకరి భూమి వేరొకరి పేరుతో నమోదు అయిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. ఆయా బాధితులు అనేకమార్లు కార్యాలయాలకు వచ్చి దరఖాస్తులు చేసుకున్నా ఫలితం లేకుండా పోయింది. అశ్వారావుపేటలో గతంలో రిజిస్ట్రేషన్ అయి అనేక లావాదేవీలు పొందిన సర్వే నెంబర్లు ఎన్నో నిషేదిత జాబితాలోకి వెళ్లాయి. స్వాతంత్ర్య సమరయోధులు, సైనికులకు కేటాయించిన భూములన్నీ నిషేధిత జాబితాలోకి వెళ్లాయి. నారంవారి గూడెం ప్రాంతంలో ఎంతోమంది రైతుల భూములు రికార్డులో కనపడటం లేదు. ఏజెన్సీ ప్రాంతంలో నిజమైన వారసులు ఎంతోమంది తమ వారసులకు బదిలీ చేయడానికి దరఖాస్తులు చేసుకున్నా తల్లి తండ్రులు జీవించివున్నారనే కారణంతో రికార్డులు వారిపేర్లతో మారడం లేదు. అదే సమయంలో ధరణిలో తెచ్చిన మార్పుల కారణంగా రెవెన్యూ అధికారులు వారసత్వ ధ్రువీకరణ పత్రం పరిశీలించనవసరం లేదనే ఆదేశాలు ఇవ్వడంతో ఏజెన్సీ ప్రాంతంలో వారసులు కానివారెంతమందికో దొడ్డిదారిన యథేచ్ఛగా వారసత్వ పట్టాలు జారీ అయిపోయాయి. ఎన్నో ఏళ్లుగా సాగులో ఉన్న అనేకమంది అసైన్డ్‌భూములు, ప్రభుత్వ భూముల్లో సాగులో ఉన్నారు. తగిన డాక్యుమెంట్లు ఉండి రిజిస్ట్రేషన్ చేయించుకోలేని భూములెన్నో ఉన్నాయి. ఇలాంటి భూములకు ప్రభుత్వం ఎంజాయ్‌మెంట్ సర్వే చేసి మోక్షం కలిగిస్తామని గతంలో చెప్పింది. కానీ ధరణి యాప్‌తో మరిన్ని చిక్కులొచ్చాయిగానీ సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదు. ముఖ్యంగ అశ్వారావుపేట పట్టణంలో కొన్ని దశాబ్దాలుగా అనేక మంది పేద రైతులు సాగులో ఉన్న, భూమిలో సాగులో లేని వారికి పట్టాలు జారీ అయి ఉన్నాయి. ఇలాంటి సమస్యలు వేల ఎకరాల్లో ఉన్నాయి. 1996-98 మధ్య ఆర్ఓఆర్ చేసిన సమయాల్లో కొన్ని భూములకు ఆ పట్టాలు వచ్చాయి. దీంతో చాలా సమస్యలు తగ్గాయి. 'ధరణి' తేవడంతో 1960కి ముందు రికార్డుల్లో ఉన్న పేర్లు తప్ప ఆ తరువాత జరిగిన లావాదేవీలు రికార్డుల్లో కనిపించకుండా పోయాయి. దీంతో కొన్ని దశాబ్దాల క్రితం ఈ ప్రాంతాన్ని వదిలేసి వెళ్లినవారు, అసలు భూములు లేకుండా తమ పని తాము చేసుకుంటూ ఉన్నవారి పేర్లు కొత్తగా రికార్డుల్లో వచ్చి చేరాయి. దీంతో మళ్లీ భూ సమస్యలు మొదటికి వచ్చాయి. ఎప్పుడో పూర్వకాలంలో భూ రికార్డుల్లో ఉన్నవారు మళ్లీ తమ పేర్లు రికార్డుల్లోకి రావడంతో తమ భూమి తమకు ఇప్పించాలంటూ తహసీల్దార్ కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నారు. వాస్తవంగా సాగులో ఉన్న రైతులను బలవంతంగ తప్పిస్తున్నారు. రికార్డుల్లో వారిపేర్లు వస్తుండటంతో అధికారులకు కూడా చేసేదేమి లేకుండా పోయింది. క్షేత్రస్థాయిలో ఉన్నపేర్లును నమోదు చేద్దామంటూ ధరణి అనుమతించే పరిస్థితి లేదు. ఇలా ఎన్నో రకాల సమస్యలతో ధరణి లేని సమస్యలను తెచ్చి పెట్టింది. జరిగిన తప్పులను సరిచేసుకునే పరిస్థితి లేదు. మరో వైపు భూములు అమ్ముకొని వెళ్లిపోయిన వారికి హక్కులు కల్పించింది. కొత్త ప్రభుత్వమైన ధరణిని ఎత్తివేసి సమూలమైన మార్పులు తెచ్చి అసలైన సాగుదారులకు భూమిపై హక్కులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

బిల్కిస్‌బానో కేసులో సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం

- ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి 9: సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా, పీసీసీ సీపీఐ(ఎంఎల్), సీపీఐ(ఎంఎల్) రివల్యూషనరీ ఇన్షియేటివ్ పార్టీలకు మద్దతుగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు హర్షనీయమని ప్రజాస్వామ్యయుతంగా ప్రశంసనీయమైన తీ ర్పును వెలువరించిందని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్య దర్శి పోటు రంగారావు హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం మద్దతుతో గుజరాత్‌లో జరిగిన సంఘటనపై 11మంది రేపిస్టుల విడుదలను సుప్రీంకోర్టు కొట్టివేసిందని, మరోసారి ప్రజా స్వామ్యాన్ని సుప్రీంకోర్టు కాపాడిందన్నారు. బిల్కిస్‌బానో కేసులో రేపిస్టులకు మహారాష్ట్ర హైకోర్టు యావజ్జీవకారాగార శిక్ష విధించిందని, ఈ నేరస్థులను కాపాడేందుకు గుజరాత్‌లోని బీజేపీ ప్రభుత్వంతో పాటు కేంద్రం సహకారంతో నేరస్థులు బయటకు వచ్చేందుకు వీలుకలిగిందని ఆరోపించారు. ఈ మేరకు మంగ ళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికైనా బీజేపీ ప్రభుత్వాలు మతోన్మాద చర్యలు చేపట్టవద్దని హితవు పలికారు.

'లాటరీ పేరిట కుచ్చుటోపీ'పై ఇంటిలిజెన్స్ ఆరా

దుమ్ముగూడెం జనవరి 9: భద్రాద్రి ఏజెన్సీలో 'లాటరీ పేరుతో కుచ్చుటోపి' పెట్టిన వ్యవహారంపై ఇంటిలిజెన్స్ అధికారి మంగళవారం ఆరా తీశారు. ఓ కేటుగాడు లాటరీ పేరిట ఆదివాసీల నుంచి రూ.లక్షలు వసూలు చేసి ముఖం చాటేసిన విషయంపై మంగళవారం 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించడంతో కొందరు బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆరెంపుల వద్ద చేపల లారీ పల్టీ.. డ్రైవర్ మృతి



ఆరెంపుల వద్ద బోల్తాపడిని చేపలలోడు లారీ

ఖమ్మం రూరల్, జనవరి 9: చేపల లోడుతో వెళుతున్న ఓ లారీ ప్రమాదవ శాత్తు పల్టీకొట్టింది. ఈ సంఘటనలో లారీ డ్రైవర్ మృతి చెందగా క్లీనర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన ఖమ్మం రూరల్ మండలం, ఆరెంపుల గ్రామం వద్ద మంగళవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరు పట్టణం నవాబ్‌పేట్ ప్రాంతానికి చెందిన లారీ డ్రైవర్ మారడాని బాలబాలాజీ (38), తానికొండ నరేష్‌కుమార్‌తో కలిసి లారీలో చేపల లోడుతో ఏలూరు నుండి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గోరఖ్‌పూర్‌కు వెలుతుంది. మార్గం మధ్యలో ఖమ్మం రూరల్ మండలం, ఆరెంపుల గ్రామం వద్దకు రాగానే ప్రమాదవశాత్తు లారీ అదుపుతప్పి చెట్టుకు డీ కొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ బాలబాలాజీ అక్కడికక్కడే మృతి చెందాడు. నరేష్‌కుమార్‌కు తీవ్ర గాయాలైయ్యాయి. విషయం తెలిసిన వెంటనే రూరల్ ఎస్ఐ సురేష్ సంఘటన స్థలాన్ని సందర్శించారు. అనంతరం అన్నం ఫౌండేషన్ సభ్యుడు అన్నం శ్రీనివాస్‌రావు బృందం సహాయంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పల్టీ కొట్టిన లారీని ఎక్స్‌కవేటర్ సహాయంతో బయటకు తీసి వేరే లారీలో చేపలను లోడు చేసుకుని పంపించారు. అయితే చేపల లోడు లారీ పల్టీ కొట్టిన విషయం తెలుసుకున్న చుట్టు పక్కల గ్రామల ప్రజలు వాటిని తీసుకువెళ్లేందుకు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. అయితే చేపలలోడు పటిష్టంగా ఉండటం చేపల బాక్సులు బయటపడకపోవడంతో వాటిని తీసుకువెళ్లాలని వచ్చిన ప్రజలు తిరిగివెళ్లిపోయారు. జరిగిన ఘటనపై రూరల్ పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సీవోఈ పిలుస్తోంది

- గురుకుల కళాశాలల్లో ఇంటర్ ప్రవేశాలకు నోటిఫికేషన్
- రాష్ట్ర వ్యాప్తంగా 38 కాలేజీల్లో 3,680 సీట్లు
- ఈ నెల 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- ఫిబ్రవరి 4న కామన్ ఎంట్రన్స్ టెస్ట్

ఖమ్మం ఖానాపురం హవేలీ, జనవరి 9: నిరుపేద విద్యార్థులు ఇంటర్ చదువు కోసం గురుకులాల్లో చేరేందుకు సదావకాశం వచ్చింది. సంక్షేమ గురుకులాలకు వన్నె తెస్తున్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ) కళాశాలల్లో జూనియర్ ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (టీఎస్‌డబ్ల్యూఆర్ సీవోఈ సెట్ 2024) నోటిఫికేషన్ వెలువడింది. ఇంగ్లీష్ మీడియంతో పాటు తెలుగు మీడియం చదువుకున్న నిరుపేద విద్యార్థులు కూడా ఈ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌ను రాయవచ్చు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయి. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల వారికి ఇంటర్మీడియెట్ బోధనతో పాటుగా ఐఐటీ, నీట్‌లాంటి ప్రవేశ పరీక్షలకు సీవోఈల్లో ప్రత్యేకమైన శిక్షణ ఇస్తారు. ఆంగ్లంలో బోధన ఉంటుంది. సెకండ్ లాంగ్వేజ్ తెలుగు మాత్రమే ఉంటుంది. బాలబాలికలకు వేర్వేరుగా సీవోఈ కళాశాలలు ఉన్నాయి.

సీట్ల వివరాలు

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 38 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ)లలో మొత్తం 3,680 సీట్లు అందుబాటులో ఉన్నాయి. బాలురకు 1680 సీట్లు, బాలికలకు 2000 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో ఎస్సీ కేటగిరీకి 75 శాతం, ఎస్సీ కన్వర్టెడ్ క్రిస్టియన్లకు 2 శాతం, ఎస్టీలకు 6 శాతం, బీసీలకు 12 శాతం, మైనార్టీలకు 3 శాతం, జనరల్, ఈబీసీ అభ్యర్థులకు 2 శాతం సీట్లు కేటాయించారు.

బాలురకు..

రంగారెడ్డి జిల్లాలోని గౌలిదొడ్డిలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఒక్కోదానిలో 120 చొప్పున మొత్తం 240 సీట్లు, ఇబ్రహీంపట్నంలో ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ఒక్కోదానిలో 40 చొప్పున మొత్తం 80 సీట్లు, సంగారెడ్డిలోని హత్నూరలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఒక్కదానిలో 80 చొప్పున మొత్తం 160 సీట్లు, మిగిలిన అన్ని కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఒక్కోదానిలో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

బాలికలకు..

రంగారెడ్డి జిల్లాలోని గౌలిదొడ్డిలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఒక్కోదానిలో 160 చొప్పున మొత్తం 320 సీట్లు, ఖమ్మంలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఒక్కోదానిలో 80 చొప్పున మొత్తం 160 సీట్లు, కిస్టాపూర్, మేడ్చల్‌లో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఒక్కోదానిలో 40 చొప్పున మొత్తం 80 సీట్లతో పాటు మిగిలిన అన్ని కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఒక్కోదానిలో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో గౌలిదొడ్డి, నార్సింగి, మహేంద్రహిల్స్(బాలికల కళాశాల)లతో పాటు, గౌలిదొడ్డి, చిలుకూరు, షేక్‌పేట (బాలుర కళాశాలలు), కరీంనగర్ అల్గునూరు (కో-ఎడ్యుకేషన్)తో కలిపి మొత్తం ఏడు సీవోఈలను ప్రీమియర్ కళాశాలలుగా పరిగణిస్తారు. కామన్ ఎంట్రన్స్‌టెస్ట్‌లో రాష్ట్ర స్థాయిలో మెరిట్ సాధించిన వారికే ఈ కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారు. మిగిలినవన్నీ నాన్ ప్రీమియర్ సీవోఈలు. ఈ కళాశాలల్లో కూడా మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు.

అర్హత లు

ప్రస్తుతం పదో తరగతి (టెన్త్ క్లాస్) పరీక్షలకు సన్నద్ధం అవుతున్న విద్యార్థులు కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. మొదటిసారే పదో తరగతి పాస్ అవ్వాలి. 2024 ఆగస్టు 31 నాటికి 17 సంవత్సరాలు ఉండాలి. ఎస్సీ,ఎస్టీ,కన్వర్టెడ్ క్రిస్టియన్లకు రెండేళ్ల మినహాయింపు ఉంటుంది. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంత అభ్యర్థులకు రూ. 1.50 లక్షలు, పట్టణ ప్రాంత అభ్యర్థులకు రూ.2 లక్షలకు మించకుండా ఉండాలి.

పరీక్ష విధానం ఇలా..

ఇందుకు సంబంధించిన పరీక్ష ఫస్ట్‌లెవల్,సెకండ్ లెవల్ విధానంలో నిర్వహిస్తారు. ప్రశ్న పత్రాలు ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో ఇస్తారు. ఒక్కో టెస్ట్ సమయం మూడు గంటలు ఉంటుంది. 8వ తరగతి నుంచి పదో తరగతి వరకు నిర్దేశించిన సిలబస్ ఆధారంగా ప్రశ్నలు అడుగుతారు. ఫస్ట్ లెవల్ పరీక్ష ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటుంది. మొత్తం 160 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలుంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు చొప్పున 160 మార్కులు కేటాయిస్తారు.

ఎంపీసీ పరీక్ష పేపర్‌లో..

ఇంగ్లీష్ నుంచి 20, మ్యాథమెటిక్స్ నుంచి 20, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోసైన్స్ నుంచి ఒక్కోదానిలో 40 ప్రశ్నలుంటాయి.

ఎంఈసీ, సీఈసీ పేపర్‌లో..

ఇంగ్లీష్ నుంచి 20, మ్యాథమెటిక్స్ నుంచి 40, సోషల్ నుంచి 70, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ నుంచి 30 ప్రశ్నలు ఇస్తారు. సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద మాత్రమే గుర్తించాలి. తప్పుగా గుర్తించిన సమాధానాలకు పావుమార్కు చొప్పున నెగెటివ్ మార్కులు ఉంటాయి. ఇక ఎంఈసీ, సీఈసీ అభ్యర్థులకు ఫస్ట్ లెవల్ టెస్ట్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా అడ్మిషన్ (ప్రవేశం) కల్పిస్తారు. ఎంపీసీ, బైపీసీ అభ్యర్థులు మాత్రం సెకండ్ లెవల స్క్రీన్‌టెస్ట్ రాయాలి. ఫస్ట్ లెవల్ టెస్ట్‌లో సాధించిన మార్కుల ఆధారంగా ఒక్క సీటుకు ఐదుగురు చొప్పున (1:5) ఎంపిక చేసి సెకండ్ లెవల్ టెస్ట్‌కు అనుమతిస్తారు. ఈ పరీక్ష డిస్క్రిప్టివ్ తరహాలో ఉంటుంది. మ్యాథ్స్, బయోసైన్స్, ఫిజిక్స్‌కెమిస్ట్రీల నుంచి ఒక్కోదానిలో 45 మార్కులతో పాటు ఇంగ్లీష్‌తో కలిపి మొత్తం 150 మార్కులు ఉంటాయి.

ఫీజు వివరాలు

కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌కు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు రూ.200 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునేందుకు 2024 జనవరి 15వ తేదీ వరకు అవకాశం కల్పించారు. హాల్‌టికెట్లను జనవరి 25 నుంచి ఫిబ్రవరి 3 వరకు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 4న కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహిస్తారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- ఆకట్టుకున్న గిరిబిడ్డల ఆట పాట
- రెండోరోజూ కొనసాగిన ఇగ్నైట్ ఫెస్ట్





యూత్ పార్లమెంట్ నిర్వహిస్తున్న దృశ్యం, గ్రౌండ్ పెయింటింగ్ వేస్తున్న విద్యార్థులు

భద్రాచలం, జనవరి 9: భద్రాచలంలోని గిరిజన గురుకుల విద్యాసంస్థలో గిరి బిడ్డల ఆట పాట ఆకట్టుకుంటోంది. ఉత్సాహంగా .ఉల్లాసంగా చిన్నారులు ఆసక్తి రేకెత్తించే విజ్ఞాన ప్రదర్శనలు, ఆబాలగోపాలాన్ని మురిపిస్తున్నాయి. భద్రాచలం గిరిజన గురుకుల విద్యాసంస్థల సొసైటీ రాష్ట్ర ఇగ్నైట్ ఫెస్ట్ ఇతోస్ ప్రోగ్రాం రెండో రోజైన మంగళవారం కూడా ఆబాలగోపాలాన్ని అలరించింది. రాష్ట్రంలోని 33జిల్లాల నుంచి 1500 మంది బాలబాలికలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. యూత్ పార్లమెంట్, యుఎన్‌వో, ఫ్లోర్ ఆర్ట్, స్పెల్‌బీ ఫ్యాషన్ షో, వ్యాస రచన, వకృత్వ, స్పాట్ డ్రాయింగ్, వీడియో మేకింగ్, స్టోరీ టెల్లింగ్, సైన్స్ ఫెయిర్, పాటల పోటీ, గ్రూప్ డ్యాన్స్ తదితర 28 అంశాలలో పోటీలు నిర్వహిస్తుండగా గెలుపొందిన వారికి పారితోషకంతో పాటు ప్రశంసాపత్రం ట్రోఫీలు అందజేస్తున్నారు. ఈ పోటీలను గిరిజన గురుకులాల డిప్యూటీ సెక్రటరీ ఎం. శ్రీనివాసరెడ్డి, ఓఎస్‌డీ ఎస్.శ్రీనివాసకుమార్ మంగళవారం పరిశీలించారు. పోటీల నిర్వహణ పట్ల వారు సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ పోటీల ద్వారా బాలబాలికలలో సృజనాత్మక శక్తి పెంపొందుంతున్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన గురుకులాల ఓఎస్‌డీ, సీఈ ఎస్.సుమలత, భద్రాచలం ఐటీడీఏ గురుకుల ఆర్‌సివో టి. వెంకటేశ్వరరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శీతాకాలం.. పంటల సస్యరక్షణ

- రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి
- వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి

ఖమ్మం వ్యవసాయం, జనవరి 9: కొద్దిరోజులుగా చలి తీవ్రత పెరుగుతోంది. రాత్రి, ఉదయం వేళల్లో చల్లని ఈదురుగాలులు వీస్తున్నాయి. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 18 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా నమోదవుతున్నాయి. రానున్న మరో ఐదు రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు మరింతగా పడిపోయే ప్రమాదముంది. మారుతున్న వాతావరణ ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ అధికారులు రైతులకు పంటల జాగ్రత్తలపై పలు సూచనలు అందిస్తున్నారు. చలికాలం రైతులు తీసుకునే జాగ్రత్తలే పంటలకు శ్రేయస్కరమని చెబుతున్నారు. వరి, మొక్కజొన్న, మిరప, శనగ, జొన్న, వేరుశనగ పంటల సాగులో పలు సూచనలు చేశారు.

వరి సాగులో..



ప్రస్తుతం నారుపోసే రైతులు ఎకరానికి సరిపడే నారుమడి ఆఖరి దుక్కిలో 500 గ్రాముల జింక్ సల్ఫేట్ వేసుకోవాలి. బాగా మాగిన పశువుల ఎరువును 400 కిలోలు, లేదా కోళ్ల ఎరువు 200 కిలోలు ఎకరానికి సరిపోయే నారుమడిలో వేసుకోవాలి. ఈ ఎరువులు వేసుకోవడం వల్ల పంట చలిని తట్టుకోవడంతో పాటు సూక్ష్మ పోషకాలైన జింక్ ఐరన్ బాగా లభ్యమవుతాయి. రాత్రి వేళల్లో నీటిని నిండుగా ఉంచి తెల్లవారుజామున తీసివేసి కొత్త నీటిని పెట్టుకోవాలి. ఒక అడుగు ఎత్తులో వెదురు కర్రలను అమర్చి దాని మీద పాలిథిన్ షీట్ లేదా టర్పాలిన్స్ సాయంత్రం వేళల్లో కప్పి ఉదయం తీసివేయాలి. ప్రస్తుత వాతావరణంలో వరినారు మళ్లలో అగ్గి తెగులు ఆశించే అవకాశాలున్నాయి. అగ్గి తెగులును గమనించినట్ల యితే ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు లేదా ఐసోప్రోథయోలిన్1.5 మిల్లీ లీటర్లు లేదా కాస్గామైసిన్ 2.5 మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. వరి నారులో జింక్ దాతు లోప లక్షణాలు గమనించినట్లయితే 2 గ్రాముల సల్ఫేట్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

మొక్కజొన్నలో..



ప్రస్తుతమున్న వాతావరణంలో వరి మాగాణుల్లో వేసిన మొక్కజొన్న పంటల్లో భాస్వరం లోప లక్షణాలుంటే ఆకులు ఊదా రంగులోకి మారు తాయి. వీటి నివారణకు 10 గ్రాముల 19:19:19 లేదా డీఏపీని లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అధికంగా కత్తెర పురుగు సోకే అవకాశాలు కూడా ఉండడంతో దీని నివారణకు 0.3 మి.లీ క్లోరాంతనిప్రోల్ లేదా 0.5 మి.లీ స్పైనటోరం మందును లీటరు నీటికి కలిపి సుడిలో పడే విధంగా పిచికారీ చేయాలి.

మిరపలో..



మిరపలో తామర పురుగు ఆశించే అవకాశం ఉన్నందున దీని నివారణ కోసం ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ లేదా డైమిథోయేట్ 2 మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. మిరపకు కాయకుళ్లు తెగులు కూడా ఆశించే అవకాశం ఉన్నందున ఎక్కడైనా దీన్ని గమనిస్తే కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు లేదా మాంకోజెబ్ లేదా 1మి.లీ ప్రొపికోనజోల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

శనగ, జొన్నలో..



శనగ పంటలో శనగపచ్చ పురుగు ఆశించే ప్రమాదం ఉంది. శనగపచ్చ పురుగు నివారణకు 1.5 గ్రాముల ఎసిఫేట్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. జొన్న పంటలో పెనుబంక పురుగు గమనించినట్లయితే 2.మి.లీ మిథైల్ డెమాటాన్ లేదా డైమిథోయేట్ లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలి.

వేరు శనగలో..



వేరుశనగ పంటలో పొగాకు లద్దె పురుగు సోకేందుకు అవకాశం ఉన్నందున ముందుగా ఎక్కడైనా చిన్న చిన్న పురుగులున్నట్లు గమనిస్తే 5 శాతం వేప కషాయం లేదా 5 మి.లీ వేప నూనె(అజాడిరెక్టిన్)లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పంటలో లార్వా ఎదిగినట్లయితే 200 మి.లీ నోవల్యూరాన్ లేదా 40 మి.లీ ఫ్లూబెండమైన్ ఎకరానికి సరిపోయేలా 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి. తిక్క ఆకుమచ్చ తెగులు గమనిస్తే 2 గ్రాముల క్లోరోథాలోనిల్ లేదా 1 గ్రాము టెబ్యుకొనజోల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. మొదలు కుళ్లు తెగులు గమనిస్తే 2 గ్రాముల కార్బన్‌డిజం, మాంకోజెబ్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

అవగాహనతో ‘సహకార’ అభివృద్ధి

- డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ కొత్వాల శ్రీనివాస్



మాట్లాడుతున్న వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్

ఖమ్మం వ్యవసాయం, జనవరి9: సహకారసంఘాలు, పాలకవర్గాలు సిబ్బంది అవగాహనతో పనిచేస్తేనే సంఘాల అభివృద్ధి సాధ్యమవుతుందని డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ కొత్వాల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ప్రధాన కార్యాలయంలో కార్మిక, వ్యవసాయ, సహకార సంఘాల పాలకవర్గసభ్యుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ సహకర సంఘాల బలోపేతానికి పాలకవర్గ సభ్యులతో పాటు సిబ్బంది అందరూ అంకిత భావంతో పనిచేయాలన్నారు. డీసీసీబీ ద్వారా భవిష్యత్తులో ఎక్కువసార్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జాతీయ, వ్యవసాయ గ్రామీణ అభివృద్ధి బ్యాంక్ నాబార్డు సౌజన్యంతో టీఎస్‌సీవోబీ సహకార శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఫ్యాకల్టీ విజయశంకర్, సుబ్బారావు మాట్లాడుతూ పాలకవర్గసభ్యులకు, సిబ్బందికి సహకార సంఘాలపై పూర్తిస్థాయి అవగాహన ఉండాలని సాంకేతిక అంశాలను బ్యాంకులకు సంబంధించిన వివిధ అంశాలను తెలుసుకోవడం ద్వారానే అవగాహన శిక్షణలో తీసుకోవడం వాటి అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఈకార్యక్రమంలో డీసీసీబీ సీఈవో అబీద్ ఉర్ రహమాన్, వివిధ సొసైటీ పాలకవర్గసభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాజెక్ట్ ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న సీఈ

పాల్వంచ, జనవరి 9: పాల్వంచ కేటీపీఎస్ కాంప్లెక్స్‌లోని విద్యుత్ కళాభారతి గ్రౌండ్‌లో మంగళవారం రాష్ట్ర స్థాయి టీఎస్ జెన్కో ఇంటర్ ప్రాజెక్ట్ ఫుట్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పోటీలను 56 దశల సీఈ ప్రభాకరరావు, 7వ దశల సీఈ వెంకటేశ్వరరావులు సంయుక్తంగా ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని థర్మల్, హైడల్ ప్రాజెక్టు నుంచి 15 జట్లు పాల్గొన్నాయి. టోర్నమెంట్ రౌండ్ రాబిన్ పద్ధతిలో కొనసాగనున్నాయి. ఈ కార్యక్రమంలో 7వ దశ స్పోర్ట్స్ సెక్రెటరీ వెంకటేశ్వర్లు, లోహిత్ ఆనంద్, వీరస్వామి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి సీఎండీతో ఎమ్మెల్యే కూనంనేని భేటీ



సింగరేణి సీఎండీ బలరాంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

ఆంధ్రజ్యోతి, కొత్తగూడెం, జనవరి 9: సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన బలరాంతో కొత్తగూడెం ఎమ్మెల్యే, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు కూనంనేని సాంబశివరావు భేటీ అయ్యారు. మంగళవారం కొత్తగూడెంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన భూగర్భ గనుల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించి కోల్ బెల్ట్ ఏరియాలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని, బొగ్గు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి, సింగరేణి ప్రాంతాలను అభివృద్ధి చేయాలని కోరారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీగా అధికార యంత్రాంగానికి సంపూర్ణ సహకారం అందిస్తామని, కార్మికుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేద్దామని సూచించారు. కార్మికుల సంక్షేమం, సొంతిటి నిర్మాణం కొరకు ప్రణాళికలు చేయాలని, కొత్తగూడెం అభివృద్ధికి పాటు పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటుగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతా రామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్, కొత్తగూడెం బ్రాంచ్ నాయకులు వంగ వెంకట్ రమణమూర్తి శుభాకాంక్షలు తెలిపారు.

ఆయిల్‌ఫెడ్‌లో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలి

- ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేసిన ఆయిల్‌పామ్ గ్రోవర్స్ యూనియన్



సీఎం కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న ఆయిల్‌ఫెడ్ జోన్ ఆయిల్‌పామ్ గ్రోవర్స్ సొసైటీ నాయకులు

అశ్వారావుపేట, జనవరి 9: గత ప్రభుత్వంలో ఆయిల్ పామ్ తోటలు రాష్ట్రం అంతటా విస్తరించే పేరుతో ఆయిల్‌ఫెడ్‌లో కోట్లాది రూపాయల అక్రమాలు జరిగాయని, తక్షణమే ఈ అక్రమాలపై విచారణ జరపాలని తెలంగాణ ఆయిల్‌ఫెడ్ అశ్వారావుపేట జోన్ ఆయిల్‌పామ్ గ్రోవర్స్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు ఉమా మహేశ్వర రెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్య ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేశారు. మంగళవారం సంఘ నాయకులు హైదరాబాదులోని ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదును అందజేశారు. ఈ ఫిర్యాదులో పలు అంశాలను పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 1.20లక్షల ఎకరాలలో ఆయిల్‌పామ్ విస్తరించి వుందని, దీనిని రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఎకరాలలో విస్తరించే లక్ష్యంతో హడావుడి చేసిన ఆయిల్‌ఫెడ్ చైర్మన్, కొందరు అధికారులు కలసి కోట్లాది రూపాయలు అక్రమాలకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వివిధ ప్రైవేటు కంపెనీలకు ఏరియా అలాట్‌మెంట్, కొత్త ప్రాంతాలలో నర్సరీల ఏర్పాటు, ఫ్యాక్టరీల నిర్మాణం, వాటికి మౌలిక సదుపాయాల కల్పన, విదేశాల నుంచి నాణ్యతలేని విత్తనాల దిగుమతి ద్వారా అక్రమాలకు పాల్పడినట్లు పేర్కొన్నారు. వీటిపై సమగ్ర విచారణ జరిపి అక్రమాలకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, సొమ్మును రికవరీ చేయాలి కోరారు. అదే విధంగా టన్ను రూ.20వేలకు కొనుగోలు చేసేల చర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలోనే రెండు ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలు ఉన్న ఖమ్మం జిల్లాలో ఆయిల్‌పామ్ రిఫైనరీని ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆయిల్‌ఫెడ్‌ను కాపాడాలని కోరారు.

పట్టభద్రుల ఎన్నికలకు ఓటర్ల జాబితా సిద్ధంచేయాలి

- ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్



ఖమ్మం కలెక్టరేట్, జనవరి 9: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు తాజా ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమా వేశ మందిరంలో ఎలక్టోరోల్ అధికారులు, జిల్లా అధికారులు, కళాశాల ప్రిన్సిపాళ్లతో ఎన్నికల సన్నద్ధ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరెడ్డి రాజీనామాతో ఖాళీ ఏర్పడ్డ వరంగల్- ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నిక చేపట్టాల్సి ఉందన్నారు. ఎన్నికల నిర్వహణకు తాజాగా ఓటర్ల జాబితా తయారీకి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి షెడ్యూల్ విడుదల చేశారని కలెక్టర్ గౌతమ్ తెలిపారు.

ఫిబ్రవరి 6వరకు దరఖాస్తులు

షెడ్యూల్ ప్రకారం డిసెంబరు 30, పబ్లిక్ నోటీస్ జారీ కాగా ఫిబ్రవరి 6 వరకు ఫారం 18 ద్వారా దరఖాస్తుల స్వీకరణ ఉంటుందన్నారు. ఫిబ్రవరి 24 డ్రాఫ్ట్ ఎలక్టోరోల్ ప్రచురణ, ఫిబ్రవరి 24 నుంచి మార్చి 14 వరకు అభ్యంతరాల స్వీకరణ, మార్చి 29 వరకు అభ్యంతరాల పరిష్కారం ఏప్రిల్ 4న తుది జాబితా ను ప్రకటించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అర్హత తేదీ నవంబరు 1 2023 నాటికి కనీసం 3 ఏళ్ల ముందు గ్రాడ్యుయేట్ తత్సమాన అర్హత పూర్తి చేసి ఉండాలన్నారు. ప్రస్తుతం గ్రాడ్యుయేట్‌గా నమోదు అయిన వారు కొత్తగా నమోదు అయ్యే వారు అంతా తాజాగా నమోదు కావాలన్నారు. దరఖాస్తు ఫారం 18 ద్వారా మాన్యువల్‌గా డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ. సీఈవో తెలంగాణ. ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చ న్నారు. నమోదుకు దరఖాస్తుతో పాటు గ్రాడ్యుయే షన్ ఉత్తీర్ణత ధ్రువీకరణ ప్రతిని గెజిటెడ్ అధికారితో అటెస్ట్ చేయించాలన్నారు. ఫొటో, అసెంబ్లీ నియోజకవర్గం ఎపిక్‌కార్డు జీరాక్స్‌ను జత చేయాలన్నారు. ఎలక్టోరోల్ నమోదు కోసం కళాశాలలు బార్ అసోసియేషన్ కోర్టుల్లో, ఐఎంఏ, సీఏ ఇంజనీర్లు బ్యాంకర్లు వృత్తిపరమైన సమూహాలతో సమావేశాన్ని నిర్వహించాలన్నారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యేల చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదర్శ్ సురభి, మయాంక్ సింగ్, జిల్లా అధికారులు, ఆర్డీవోలు గణేష్ పాల్గొన్నారు.

జాతీయ ఖోఖో క్రీడలకు దేవేందర్



గుండాల, జనవరి 9: మారుమూల గ్రామం నుంచి జాతీయ ఖోఖో పోటీలకు గుండాల మండలంలోని గురుకుల కాలేజ్‌లో చదువుతున్న ఓ విద్యార్థి ఎంపికయ్యాడు. గుండాల మండల పరిధిలోని గణపురం గ్రామానికి చెందిన కల్తి దేవేందర్, గుండాల తెలంగాణ గురుకుల కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. ఇటీవల కోల్ ఇండియా అసోషియన్ ఆధ్వర్యంలో హైదారాబాద్‌లో నిర్వహించిన ఖోఖో పోటీల్లో దేవేందర్ జాతీయ స్థాయిలో ఎంపియ్యాడు. ఈ నెల 26న తమిళనాడులో జరగబోయే జాతీయ స్థాయి క్రీడల్లో దేవేందర్ పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ హరికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

నిరుపయోగంగా బుల్‌యంత్రం

- మరమ్మతులకు నోచుకోని పారిశుధ్య నిర్వహణ యంత్రం
- ఏడాదిగా చెరువుకట్టపైనే ట్రాక్టర్ డోజర్



నిరుపయోగంగా డోజర్ ట్రాక్టర్ (బుల్)

మణుగూరు, జనవరి 9: పారిశుధ్య నిర్వహణకు ఉపయోగించే బుల్ యంత్రం మూలన పడింది. చిన్న చిన్న మరమ్మతులు రావడంతో ఈ ట్రాక్టర్ డోజర్ పనికి రాకుండా పోయింది. లక్షలు ఖర్చు చేసి కొన్న యంత్రాన్ని పట్టించుకోకుండా వదిలేశారు. మరమ్మతులు చేయించకపోవడంతో సేవలందించలేక ఈ డోజర్ ట్రాక్టర్ చెరువు కట్టపై దర్శనమిస్తోంది. ఇది మణుగూరు మునిసిపాలిటీ తీరు. గత ఏడాది క్రితం చిన్న చిన్న మరమ్మతులకు గురైన ఈ బుల్ అనే ఈ యంత్రాన్ని పట్టించుకునే దిక్కు లేకుండా పోయింది. ఆయిల్ మార్పు, సిలిండర్ల మరమ్మతులు.. ఇలా చిన్న చిన్న రిపేర్లు చేస్తే దాదాపు రూ.20 నుంచి 40వేల వరకు ఖర్చు అవుతుందని మునిసిపల్ సిబ్బంది చెబుతున్నారు. ఏడాది కాలంగా ఈఖర్చును భరించలేకో, మరెందుకో గానీ అధికారులు దీని గురించి పట్టించుకోవడం పై విమర్శలు వస్తున్నాయి.

అద్దెకు వాహనాల ఏర్పాటు

మైనర్ రిపేర్లు చేసి నడిపించుకుంటే మంచి సేవలందించే వాహనాన్ని వదిలి గత ఏడాదిగా ప్రైవేటు యంత్రాలకు అద్దెలు చెల్లిస్తూ పలు పనులను అధికారులు చేపిస్తున్నారు. ఇందుకోసం ఇప్పటి వరకు లక్షల రూపాయాల బిల్లులను బయట వ్యక్తులకు చెల్లించినట్లు వినికిడి. మునిసిపాలిటీలోని సొంత వాహనానికి మరమ్మతులు చేయించాలంటే పాల్వంచ తీసుకెళితే ఒక్కరోజులోనే రిపేర్లు పూర్తి అయి సేవలందించేందుకు ఈ బుల్ వాహనం సిద్ధం అవుతుందని పలువురు మెకానిక్‌లు అంటున్నారు. అయితే అందుకు అధికారులకు సిబ్బందికి సమయం దొరకపోవడం విస్మయానికి గురి చేస్తోంది. పనిచేసే యంత్రాలను మూలన పెట్టి అధిక మొత్తంలో అద్దె వాహనాలు తెచ్చి పనులు చేపించడం పట్ల పలు ఆరోపనలు వెల్లు వెత్తుతున్నాయి ఇప్పటికైనా మణుగూరు మునిసిపాలిటీ అధికారులు కార్యాలయం ముందే చెరువు కట్టపై నిలిపి ఉన్న ఈ వాహనాన్ని పరిశీలించి రిపేర్లు పనులు చేయించి ప్రజా సేవలకు అందుబాటులో తేవాలని మునిసిపాలిటీ ప్రజలు కోరుతున్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలి

- ఆర్టీసీ రీజినల్ మేనేజర్ వెంకన్న



మాట్లాడుతున్న ఆర్ఎం వెంకన్న

ఖమ్మం ఖానాపురంహవేలి, జనవరి 9: సంక్రాంతి పండుగ సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో 220 మహాలక్ష్మి సర్వీసులు, 66 రిజర్వేషన్ సర్వీసులు అందుబాటులో ఉంటాయని రీజినల్ మేనేజర్ సీహెచ్ వెంకన్న తెలిపారు. ప్రయాణికులకు నాణ్యమైన సేవలు అందించాలని డిపో మేనేజర్లకు సూచించారు. మంగళవారం నగరంలోని నూతన బస్టాండ్‌లో అన్ని డిపోల మేనేజర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ పండుగ సందర్భంగా మహాలక్ష్మి పథకంలో ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉంటుందని ప్రయాణికులు గమనించి ముందస్తుగా ప్రయాణాన్ని ప్లాన్ చేసుకోవాలని తెలిపారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు జేశామని తెలిపారు. ప్రయాణికులతో రద్దీ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల సహకారం తీసుకోవాలని డిపో మేనేజర్లకు తెలిపారు. పండుగకు అన్ని అదనపు సర్వీసుల్లో సాధారణ చార్జీలతోనే నడుస్తాయని తెలిపారు. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో మహాలక్ష్మి పథకాన్ని మహిళలు ఉపయోగించుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని డిపోల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన రైల్వే ఉద్యోగులు

మధిర, జనవరి9: కొత్త పెన్షన్ విధానం రద్దు చేసి పాతపెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రైల్వే ఉద్యోగులు, హంగర్ వర్కర్స్ సమ్మెలోకి దిగారు. ఉద్యోగులు మంగళవారం విధులను బహిష్కరించి ఆందోళనలో పాల్గొన్నారు. ఈనెల 8నుంచి 11వరకు దేశవ్యాప్తంగా హంగర్స్ సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మధిర బ్రాంచ్ కార్యదర్శి అనిల్ కుమార్, సంఘ మాజీ చైర్మన్ కోటేశ్వరరావు, వర్కింగ్ చైర్మన్ కృష్ణ, అసిస్టెంట్ సెక్రెటరీ రాజు, రవి, వైస్ చైర్మన్ వీరప్రసాద్, ఉమ, ప్రవీణ్, వేణు, రవిచంద్ర, బాబూరావు, నాగేశ్వరరావు, రమేష్ నాయుడు పాల్గొన్నారు.

కారేపల్లి: ఏఐఆర్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం కారేపల్లి రైల్వేస్టేషన్ ఎదుట ఒకరోజు రిలేనిరాహారదీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలోప్రసాద్, భూక్యా బాలాజీ, నల్లమద రమేష్, భూక్యా శ్రీను, వైరా శ్రీను, హేమ్లాలాల్, చిన్ని పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

వైరా,జనవరి 9: వైరా మునిసిపాలిటీ పరిధిలో రేచర్ల బ్రదర్స్ శ్రీకాంత్, వెంకటేష్ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను మంగళవారం మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ ప్రారంభించారు. స్థానిక సత్రంబజార్‌కు చెందిన యూత్ వారు సంక్రాంతి పండుగను పురస్కరించుకొని క్రికెట్ పోటీలు ఏర్పాటుచేశారు. జైపాల్ ఈ పోటీలను ప్రారంభించి నిర్వాహకులను అభినందించారు. కాంగ్రెస్ నాయకులు కట్ల రంగారావు, మిట్టపల్లి నాగి, ధార్న రాజశేఖర్, బండారు తిరుపతిరావు, అంజద్‌పాషా, రేచర్ల రామారావు, శ్రీకాంత్, షేక్.సమీర్, ఆనంద్, రాము, గోపి, సాయి, రాకేష్, శ్రీకాంత్, పండు, నీరజ్ పాల్గొన్నారు.

ఉమ్మడిజిల్లాస్థాయి షటిల్ పోటీలు

కొణిజర్ల: కొణిజర్లలో ఈనెల 12,13,14 తేదీల్లో సంక్రాంతి సందర్భంగా ఎస్ఎస్ హెల్పింగ్ హ్యాండ్స్ వారి ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మంస్థాయి షటిల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

గురుకులంలో ఐదోతరగతిలో ప్రవేశాల దరఖాస్తుల గడువు పెంపు

సత్తుపల్లి, జనవరి 9: తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5 వతరగతి ప్రవేశానికి ఈ నెల 20వరకు దరఖాస్తుల గడువును పొడిగించినట్లు ప్రిన్సిపాల్ మట్ట దేవజ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ,జనరల్ గురుకులాల ఆధ్వర్యంలో నడుపబడుతున్న బాలుర, బాలికల గురుకుల పాఠశాలలో పైవిధంగా 5 వతరగతిలో ప్రవేశం పొందేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. దరఖాస్తులను ఆన్లైన్లో మాత్రమే చేసుకోవాలని, దరఖాస్తు ఆన్లైన్లోనే చేయాలన్నారు. ప్రవేశ పరీక్ష వచ్చేనెల 11న ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు జరుగుతుందన్నారు. వివరాలకు ఆయా ప్రాంతాలలోని గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించాలన్నారు.

విద్యుత్ సర్వీసులేని ఇళ్లకు కనెక్షన్లు ఇవ్వాలి

- అధికారులతో కలెక్టర్ వీపీ గౌతమ్ సమీక్ష
- రూరల్ మండలంలో ప్రజాపాలన దరఖాస్తుల డేటా ఎంట్రీ పరిశీలన



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, జనవరి9: విద్యుత్ కనెక్షన్లు లేని ఇళ్లకు కనెక్షన్లు ఇచ్చేలా ఆ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యుత్‌శాఖ అధికారులతో గృహజ్యోతి, మిషన్ భగీరథ, గిరివికాసం, పాఠశాలలు అంగన్వాడీ కేంద్రాలు, హెల్త్ సబ్‌సెంటర్లకు విద్యుత్ కనెక్షన్లపై కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో ప్రజాపాలన అభయహస్తం కింద దరఖాస్తుల స్వీకరించినట్లు తెలిపారు. వీటిలో కొన్నింటికి విద్యుత్ సర్వీస్ మీటర్ నెంబర్ ఇవ్వలేదని తెలిపారు. సర్వీస్ కనెక్షన్ పొందుపరచక పోవడానికి కారణాలువిశ్లేషించాలన్నారు. బిల్‌స్టాప్ కనెక్షన్ల విషయంలో వినియోగదారులతో సెటిల్ చేసుకుని కొత్తమీటర్‌కు దరఖాస్తు చేయించాలన్నారు. ఇంటి నెంబర్ ఉండి ఇల్లు పేరు తండ్రి కుటుంబీకుల పేరుతో ఉన్న కారణంగా మీటర్లు ఇవ్వని చోట వెంటనే మీటర్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. చింతకాని చిన్నమండవ, జాలిముడి, జమలాపురం సీపీడబ్ల్యూ పథకాలను పునరుద్ధరించేందుకు విద్యుత్ చార్జీల ఏరియర్స్‌పై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో విద్యుత్‌శాఖ ఎస్ఈ కె రమేష్, మిషన్ భగీరథ ఎస్ఈ సదాశివకుమార్, జిల్లా సంక్షేమ అధికారి సుమ, మిషన్‌భగీరథ ఈఈ పుష్పలత, విద్యుత్‌శాఖ డీఈలు బాబూరావు, రామారావు, కృష్ణ, నాగేశ్వరరావు రాములు ఏఎస్‌వో శ్రీధర్, ఏఈలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పకడ్బందిగా ఉండాలి

ప్రత్యేక అధికారులు ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తుల డేటాఎంట్రీ ప్రక్రియ పర్యవేక్షణను పకడ్బందిగా చేపట్టాలని కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ప్రత్యేక అధికారులతో ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తుల డేటా ఎంట్రీ నమోదుపై సమీక్షించారు. పంచాయతీ కార్యదర్శులు నూరుశాతం మండల ప్రత్యేక అధికారులు ఒకశాతం దరఖాస్తుల పరిశీలన చేయాలన్నారు. ఆధార్, రేషన్ కార్డుల నెంబర్లు సరిచూడాలన్నారు ఎక్కువ పొరబాట్లు చేసిన డేటాఎంట్రీ ఆపరేటర్లను మార్చాలన్నారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ బి సత్యప్రసాద్, ఖమ్మం మునిసిపల్ కమీషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ కలెక్టర్ మయాంక్ సింగ్, మండల ప్రత్యేక అధికారులు, ఆర్డీవోలు జి గణేష్, అశోక్ చక్రవర్తి ఎస్డీసీ ఎం రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

25 లోపు సీఎంఆర్ బియ్యాన్ని పూర్తి చేయాలి

ఈనెల25లోగా సీఎంఆర్ రైస్‌డెలీవరీని పూర్తి చేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కాన్ఫరెన్స్ హాల్లో రైస్ మిల్లర్లు, అధికారులతో ఖరీఫ్ 2022-23 సీజన్‌కు సంబంధించి సీఎంఆర్ రైస్ డెలివరీపై ఆయన సమీక్షించారు. రైస్ మిల్లర్లు ఎఫ్‌సీఐడీ 182790 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రైస్ డెలివరీ చేయాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు 171754.900 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రైస్ అందించగా ఇంకా 11035.122 మెట్రిక్ టన్నులు అందచేయాల్సి ఉందన్నారు. ఈసమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీలత, ఎఫ్‌సీఐ డివిజనల్ మేనేజర్ రంగప్రసాద్ నాయక్, జిల్లారైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మా రాజేశ్వరరావు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీలో తప్పులు జరగకుండా చూసుకోవాలి

ఖమ్మంరూరల్: ప్రజాపాలన దరఖాస్తుల డేటా ఎంట్రీలో చిన్న తప్పులు కూడా జరగకుండా చూసుకోవాలని కలెక్టర్ గౌతమ్ అధికారులకు, సిబ్బందికి సూచించారు. మండల పరిధిలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న దరఖాస్తుల డేటా ఎంట్రీ ప్రక్రియను మంగళవారం పరిశీలించారు. రేషన్, ఆధార్ కార్డు నెంబర్లు జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు.దరఖాస్తులను డేటా ఎంట్రీ ఆపరేటర్లు సూచించిన ప్రదేశంలో మాత్రమే నమోదు ప్రక్రియ చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్‌రెడ్డి, ఎంపీవో రాజారావు పాల్గొన్నారు.

సీసీఐ కొనుగోళ్లు పునఃప్రారంభం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తల్లాడ,జనవరి9: తల్లాడ జిన్నింగ్ మిల్లులోని సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం పునః ప్రారంభించారు. ఈనెల ఏడోతేదీన 'ఆంధ్రజ్యోతి'లో 'సీసీఐ కొనుగోళ్ల నిలిపివేత... దళారులను ఆశ్రయిస్తున్న పత్తి రైతులు' అనే కథనానికి స్పందించి సీసీఐ అధికారులు కొనుగోలు కేంద్రాన్ని పునఃప్రారంభించారు. మంగళ వారం సాయంత్రం వరకు 200క్వింటాళ్ల మేరకు పత్తిని కొనుగోలు చేసినట్లు అసిస్టెంట్ బయ్యర్ అఖిల్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ఉద్యమకారులను గుర్తించాలి

ఏన్కూరు టీజేఏసీ కన్వీనర్ సత్యనారాయణ

ఏన్కూరు, జనవరి9: తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులందరిని గుర్తించాలని ఏన్కూరు మండల టీజేఏసీ కన్వీనర్ గిద్దగిరి సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం టీజేఏసీ మండల కమిటీ సమావేశం జరిగింది. ఈసమావేశంలో ఉద్యమకారులు కొంటు సాంబయ్య, దేశిన్ని గణేష్, ఇంజం దేవదాసు, కొవ్వూరి నాగేశ్వరరావు, కొండె వెంకటేశ్వర్లు, మోరబోయిన కృష్ణ, ఇటికాల రాజు, కొరివి భాస్కరాచారి పాల్గొన్నారు.

సారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

కల్లూరు, జనవరి9: మండలంలోని బత్తుపల్లి, కొత్తబొడెమల్లె, వాచ్యానాయ్ తండ, హనుమతండ గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. కొత్తబోడెమల్లిలో గ్రామంలో గుడుంబా తయారీ చేస్తున్న అజ్మీర కిషోర్‌పై కేసు నమోదు చేశామని ఎక్సైజ్ ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. సత్తుపల్లి ఎక్సైజ్ సీఐ సూచన మేరకు ఈ దాడులు చేశామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో అబ్కారి సిబ్బంది భాస్కర్, ప్రేమ్, విజయ్ పాల్గొన్నారు.

బిట్స్‌పిలానీ పరీక్షలో 'హార్వెస్ట్' విద్యార్థుల సత్తా



ప్రతిభచూపిన విద్యార్థులతో యాజమాన్యం

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి9: నగరంలోని హార్వెస్ట్ విద్యార్థులు బిట్స్‌పిలాని ఇన్ఫినిటి పరీక్షలో సత్తా చాటారని విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి తెలిపారు. అక్టోబరు18న నిర్వహించిన గణిత పోటీ పరీక్షల్లో సౌత్ జోన్ నుంచి హార్వెస్ట్ విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారని తెలిపారు. పాఠశాలకు చెందిన టీ రేవంత్ కుమార్ ప్రథమ స్థానంలో నిలిచాడని తెలిపారు. జనవరి 11 నుంచి 13 వరకు ముంబైలో జరిగే ఆల్ ఇండియాస్థాయి పరీక్షకు పాఠశాల నుంచి పలువురు పాల్గొంటారని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను పలువురు అభినందించారు.

ఎడ్యుకేషనలిస్ట్ ఆఫ్ ఇయర్‌గా ఈశ్వరి ఎంపిక

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి9: నగరంలోని డాక్టర్ మెడికల్ అకాడమీ కో డైరెక్టర్ రాయల ఈశ్వరి ఎడ్యుకేషనలిస్ట్ ఆఫ్ ఇయర్‌గా ఎంపికైనట్లు విద్యా సంస్థల డైరెక్టర్ రాయల సతీష్‌బాబు తెలిపారు. సోమవారం హైద్రాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, సినీ హీరో సుమన్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. తెలంగాణా వ్యాప్తంగా జరిగిన ఈ పోటీలలో రాయల ఈశ్వరి విజేతగా నిలిచారని డైరెక్టర్ తెలిపారు. ఆమెను పలువురు అభినందించారు.

అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ తొలగింపు

ఖమ్మంలీగల్,జనవరి9:ఖమ్మం మొదటి అదనపు జిల్లా కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొత్త వెంకటేశ్వరరావును తొలగిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత అసెబ్లీ ఎన్నికల సందర్భంగా మాజీ మంత్రి అజయ్ కుమార్‌కు అనుకూలంగా ఎన్నికల సభలో పాల్గొన్నాడని కోయిన్ని వెంకన్న కలెక్టరుకు ఫిర్యాదు చేశాడు. విచారణ నిర్వహించిన అధికారులు ఉన్నతాధికారులకు నివేదికను అందజేయడంతో ఆయనను పబ్లిక్ ప్రాసిక్యూటర్ పదవి నుంచి తొలగిస్తూ తెలంగాణ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ స్థానంలో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తున్న జి.హరేందర్‌రెడ్డిని నియమించారు.

బీఆర్ఎస్ పార్లమెంటరీ సమీక్ష సమావేశానికి సండ్ర

సత్తుపల్లి, జనవరి9: హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన ఖమ్మం పార్లమెంట్ సమీక్ష సమావేశానికి సత్తుపల్లి నియోజకవర్గం తరుపున మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, బీఆర్ఎస్ శ్రేణులు హాజరైనారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ఈ సమావేశానికి నియోజకవర్గం పరిధిలో గల ఐదు మండలాల నుంచి బిఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు తరలి పోయారు.

బాల కార్మికులు లేని సమాజాన్ని నిర్మించాలి

ఖమ్మంఖానాపురంహవేలి,జనవరి9:బాలలను వెట్టిచాకిరి, బాలకార్మిక వ్యవస్థ లాంటి మురికి కూపాల్లోంచి సంరక్షించాలని ఆపరేషన్ 10ఎస్సై యాకూబ్ అన్నారు. మంగళవారం నగరంలోని బాలాజీ నగర్ ప్రభుత్వ పాఠశాలలో పోలీస్ యాంటీ హ్యూమన్ ట్రాకింగ్ యూనిట్ ఆధ్వర్యంలో సురక్షిత గ్రామ కార్యక్రమం నిర్వహించారు.

వీధివ్యాపారులకు గొడుగుల పంపిణీ

ఖమ్మంసాంస్కృతికం,జనవరి9: లయన్స్‌క్లబ్ ఆఫ్ ఖమ్మం ఆధ్వర్యంలో మంగళవారం ఖమ్మంలో ముగ్గురు వీధి వ్యాపారులకు మూడు గొడుగులను పంపిణీ చేశారు. కాల్వొడ్డు, స్టేషన్ రోడ్డు, ప్రాంతాల్లో రోడ్లపై పండ్లు, విక్రయించే చిరువ్యాపారులు ఎండ, వానకు గురవుతుండటాన్ని గమనించిన లయన్స్‌క్లబ్ సభ్యుడు కెవి ప్రసాద్ ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో కాకర్ల మల్లిఖార్జునరావు, కల్వకుంట్లగోపాల్, అవోపాకృష్ణమూర్తి, ఏటుకూరి శ్రీనివాసరావు, మేకా దుర్గానాగేశ్వరరావు మాటేటి రవి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

కల్లూరు, జనవరి9: మండలంలోని పెద్దకోరుకొండి గ్రామంలో ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటనపై స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదు చేశారు. మండలంలోని పెద్దకోరుకొండి గ్రామానికి చెందిన కంచెపోగు వెంకట్వేర్లు (57) పెద్దపల్లి జిల్లా రామగుండంలో గోదావరిఖనిలో ఉద్యోగం చేస్తూ వలింటీర్‌గా ఉద్యోగ విరమణ చేశాడు. ఆ తరువాత తన స్వగ్రామమైన పెద్దకోరుకొండికి ఇటీవల వచ్చాడు. కాగా మతిస్థిమితం లేక ఇటీవల తన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తన భర్త ఆచూకి కనిపించనందున భార్య సుజాత స్థానిక పోలీసులకు పిర్యాదు చేసింది.

రాధాకృష్ణమూర్తికి నివాళి

వైరా, జనవరి9: వైరా మునిసిపాలిటీ పదోవార్డు గండగలపాడులో సోమవారం రాత్రి నిర్వహించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు కాజా రాధాకృష్ణమూర్తి వర్ధంతి నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు, పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్, నాయకులు మల్లెంపాటి రామారావు, మచ్చా మణి పాల్గొన్నారు.

రెండు ఇసుక లారీల పట్టివేత

ముదిగొండ,జనవరి9:ఏపీ నుంచి ఖమ్మం తరలిస్తున్న రెండు ఇసుక లారీలను ఎస్ఐ గజ్జల నరేష్ మంగళ వారం ముదిగొండలో పట్టుకున్నారు. ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు చేసి పట్టుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇల్లు దగ్ధం



కాలిపోతున్న ఇల్లు

కూసుమంచి, జనవరి9: మండలంలోని చేగొమ్మ గ్రామంలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణంగా బొల్లం సైదులుకు చెందిన ఇల్లు దగ్ధమైంది. ఇంట్లో నిల్వ ఉంచిన పత్తి, ధాన్యంతో పాటు వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో కట్టుబట్టలతో మిగిలిపోయారు. సన్నకారురైతు అయిన సైదులు కుటుంబసభ్యులతో కలిసి పొలంపనులకు వెళ్లాడు. ఘటన జరిగిన వెంటనే చుట్టుపక్కల ప్రజలు బాధితులకు, ఫైర్‌సిబ్బందికి సమాచారం అందించారు. ఈలోగా మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో ఫైర్‌సిబ్బంది వచ్చేలోగా అన్నీ దగ్గమయ్యాయి. స్థానిక యువకులు ధైర్యం చేసి ఇంట్లో ఉన్న గ్యాస్ సిలీండర్ బయటకు తీసుకరావడంతో ప్రమాదం తప్పినట్లయింది. సుమారు రూ.20లక్షల ఆస్తి నష్టపోయినట్లు బాధితులు తెలిపారు.

సమస్యలపై మంత్రికి వినతి

తిరుమలాయపాలెం, జనవరి9: మండలంలోని వివిధ గ్రామాల్లోని పలు సమస్యలపై రెవెన్యూ, గృహనిర్మాణ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఎంపీపీ బోడ మంగిలాల్ ఆధ్వర్యంలో మంత్రికి విన్నవించారు. మండలంలోని 40గ్రామపంచాయతీలుండగా వాటికి పంచాయతీ కార్యాలయాలు లేవని , కార్యాలయాలు ఏర్పాటు చేయాలని వివరించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం

తల్లాడ, జనవరి9: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ మంగళవారం తల్లాడ, మల్లవరం గ్రామాల్లో సభలు జరిగాయి. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా, అటల్‌పెన్షన్ యోజన, సుకన్య సంమృద్ధి పథకం, ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన, ప్రధానమంత్రి పసల్ యోజన, సురక్షా బీమాయోజన, టీబీ ముక్తాభారత్, నేషనల్ హెల్త్‌మిషన్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కొండపల్లి శ్రీదేవి, ఎంపీటీసీ దగ్గుల రఘుపతిరెడ్డి, సర్పంచ్ దుగ్గిదేవర సామ్రాజ్యం, డాక్టర్ బి.శ్రీకాంత్, ఏపీఎం శ్రీనివాస్, ఏపీవో కోటయ్య, ఎస్‌బీఐ మేనేజర్ ఇబ్రహీం, ఏఈవో గురుమూర్తి పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్

కొణిజర్ల, జనవరి9: ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని, తప్పులు ఉండొద్దని అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. కొణిజర్ల మండలానికి సంబంధించి ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ స్థానిక విజయ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్నారు. 18వేలకు పైగా దరఖాస్తులు రాగా 54 మందితో ఆన్‌లైన్ ప్రక్రియను చేపట్టారు. మంగళవారం ఆన్‌లైన్ ప్రక్రియను అడిషనల్ కలెక్టర్‌తో పాటు ట్రైనీ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి సూచనలు చేశారు. ఇప్పటి వరకు 12 వేలు పూర్తి అయిన్నట్లు తెలిపారు. జాగ్రత్తగా ఆన్‌లైన్ చేయాలని, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డుల నెంబర్‌లలో తేడాలు ఉండరాదని తెలిపారు. ఆన్‌లైన్ ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడవో మహాలక్ష్మీ, ఎంపీవో ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇరుముడి వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే

కారేపల్లి,జనవరి9: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆరుగ్యారంటీలను పూర్తిస్తాయిలో అమలుచేసి తీరుతామని వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అన్నారు. మంగళవారం కారేపల్లి మండలంలోని భాగ్యనగర్ తండాలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కొందరు పథకాల అమలుపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని వారి మాటలు నమ్మవద్దని అన్నారు రోజు ప్రభుత్వ పాలనలో ఎమ్మెల్యేలు అందరికి సంతోషంగా ఉందన్నారు. కారేపల్లి మండల పరిధిలోని భాగ్య నగర్‌తండా, చీమలపాడులో అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రథమ ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా జయంతి

ఖమ్మంచర్చికాంపౌండ్, జనవరి9: సావిత్రి బాయి పూలే మహిళ సంఘం ఆధ్వర్యంలో ప్రథమ ముస్లిం మహిళ ఉపాధ్యాయురాలు షేక్ ఫాతిమా జయంతిని ఖమ్మం నగరంలోని సంఘం కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. పలువురు ఫాతిమా చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సావిత్రిబాయి పూలే మహిళ సంఘం అధ్యక్షులుగా పీఆర్‌దేవి, ప్రధాన కార్యదర్శిగా ఉపేంద్రబాయ్, ఉపాధ్యక్షులుగా అనంతలక్ష్మి, భూక్యా మణి, సునీత, కార్యదర్శులుగా నాగలక్ష్మి, వేల్పుల ఝాన్సీ, సలహాదారులతో కమిటీని ఎన్నుకున్నారు.

'పది'లో సత్ఫలితాల సాధనకు కృషి చేయాలి

వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

తల్లాడ, జనవరి 9: పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో సత్ఫలితాల సాధనకు కృషి చేయాలని విద్యాశాఖ వరంగల్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి సూచించారు. మంగళవారం తల్లాడ జడ్పీఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఐఎఫ్‌పీ పనితీరును పరిశీలించారు. పదోతరగతి భౌతిక శాస్త్రం క్లాసును బోధించారు. గతం కంటే పదోతరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. పదోతరగతి విద్యార్థులకు అదనపు తరగతుల నిర్వహణ గురించి విద్యార్థులను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో ఎన్.దామోదర్‌ప్రసాద్, ప్రధానోపాధ్యాయురాలు పి.ప్రసూన, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి భాషా సేవలు మరువలేనిది

టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

కామేపల్లి, జనవరి 9: కాంగ్రెస్ పార్టీకి మాజీ సర్పంచ్ దారావత్ భాషా సేవలు మరవలేనివని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన వర్ధంతి సందర్భంగా నెమలిపురిలో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షుడు గింజల నర్సింహరెడ్డి, ఏపూరి మహేందర్, దమ్మలపాటి సత్యనారాయణ, సర్పంచులు దారావత్ బాలు, విజయ నాయకులు గోపిరెడ్డి, రామక్రిష్ణ, భాషా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పరిశీలన

ఖమ్మంకార్పొరేషన్,జనవరి9:: ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను మంగళవారం నగరపాలకసంస్థ కార్యాలయంలో కమిషనర్ ఆదర్శ్‌సురభి పరిశీలించారు.. నగరపాలకసంస్థ పరిధిలో 81,163 ధరఖాస్తులు రాగా.130 మంది ఆపరేటర్లను ఆన్‌లైన్ ప్రక్రియ నమెదుకు వినియోగిస్తున్నారు. ఆహార భద్రతా, ఆధార్‌కార్డు నెంబర్లు జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. కొందరు ఆధార్‌కార్డుకు సంబంధించిన పూర్తినెంబర్లు దరఖాస్తులో నమోదు చేయలేదని, అటువంటి వారికి ఫోన్‌చేసి నెంబర్లు తెలుసుకొని నమోదు చేయాలన్నారు.

బాధిత కుటుంబానికి హెల్పింగ్ హ్యాండ్స్ చేయూత

రఘునాథపాలెం,జనవరి9: మెదడులో రక్త సంబంధమైన వ్యాధితో బాధపడుతున్న బూర్గంపాడుకు చెందిన కందుల మరియమ్మ ప్రభుత్వ వైద్యశాలలో వైద్యసేవలు పొందుతూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు స్పందించారు. విరాళాలుగా సేకరించిన రూ.13వేలను మరియమ్మ కుమారుడుకి అందజేశారు.



డబ్బులు అందజేస్తున్న వార్డు సభ్యులు గోపీ

చలో పార్లమెంట్ విజయవంతం చేయాలి

వైరా, జనవరి 9: ఈనెల 12న వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్యకార్యాచరణ ఆధ్వర్యంలో నిర్వహించే ఛలో పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు వెంకటేష్ పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి వైరాలో ఛలో పార్లమెంట్ విజయవంతం చేయాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్ రాజ్‌కుమార్, కోట ప్రేమ్‌కుమార్, తరుణ్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించేలా కృషి చేయాలి

ఏఎంవో రవి కుమార్

బోనకల్, జనవరి9: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా ఆకడమిక్ మానిటరింగ్ అధికారి (ఏఎంవో) రవికుమార్ సూచించారు. బోనకల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన స్కూల్‌కాంప్లెక్స్ సమావేశాన్ని పర్యవేక్షించారు. క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఉన్నప్పటికి వాటిని అధిగమిస్తూ మెరుగైన ఫలితాలు సాదించేలా కష్టపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి దామాల పుల్లయ్య, కాంప్లెక్స్ హెచ్ఎంలు సునీల్ కుమార్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యువ రచయిత్రులకు రేపు శిక్షణ

మధిర, జనవరి9: హైదరాబాద్‌లో తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో గురువారం యువ రచయిత్రులకు ఒకరోజు శిక్షణ ఇవ్వనున్నారు. నిపుణులకు పారితోషికాలు, భోజన వసతి కల్పిస్తామని సుమిత్రా యూత్ అసోసియేషన్ కార్యదర్శి నిబానుపూడి సుబ్బరాజు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు9603727234కు కవిత పంపుతూ వివరాలు జత చేయాలన్నారు.

'గ్రీన్‌ఫీల్డ్' అలైన్‌మెంట్ మార్చాలని నిరసన

ఖమ్మంరూరల్, జనవరి9: నాగపూర్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి అలైన్‌మెంట్ మార్చాలని జాతీయ రహదారి బాధిత రైతులు మండల పరిధిలోని తీర్దాల గ్రామంలో మంగళవారం నిరసన తెలిపారు. జాతీయ రహదారి కింద భూములు కోల్పోతున్న రైతులు, వారి భూముల వివరాలు తెలిపేందుకు రెవెన్యూ, జాతీయ రహదారుల శాఖ అధికారులు తీర్దాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామ సభకు వచ్చిన బాదిత రైతులు సభను అడ్డుకున్నారు. గ్రామ సభకు వచ్చిన ఆర్డీవో గణేష్, తహసీల్దార్ రామకృష్ణకి రైతులు వివిద పార్టీల నాయకులు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు, కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ ప్రజాపంథా, తదితర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీలను భర్తీ చేయాలి

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్ డిమాండ్

ఖమ్మంసంక్షేమవిభాగం,జనవరి9: జిల్లా ప్రభుత్వ హాస్పటల్‌లో ఖాళీగా ఉన్న వైద్యులు, నర్సింగ్, పారామేడికల్, ఇతర ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తి చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం జిల్లా కమిటీ కార్యాలయం సుందరయ్య భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై సమావేశంలో చర్చించారు. 550పడకలు ఉన్న హాస్పటల్‌కు కనీసం 150 మంది వైద్యులు నియామకం జరగాలని డిమాండ్ చేశారు. క్యాథ్‌లాబ్‌లో అరకొరగా అపరేషన్లు జరుగుతున్నాయని విమర్శించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు వై విక్రమ్, నందిపాటి మనోహర్, నవీన్‌రెడ్డి, దొంగల తిరుపతిరావు, మీరా, బోడపట్ల సుదర్శన్ పాల్గొన్నారు.

సీపీఎం సానుభూతిపరుడు కన్నుమూత

ఖమ్మంరూరల్, జనవరి9: మండల పరిదిలోని గుదిమళ్ల గ్రామానికి చెందిన సీపీఎం సానుభూతిపరుడు రానేరు బిక్షం అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్ ఆయన మృతదేహన్ని సందర్శించి నివాళులర్పించారు.

సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల వేతనాలు అందించాలి

ఖమ్మం ఖానాపురంహవేలి జనవరి 9: సర్వశిక్ష అభియాన్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు నవంబర్, డిసెంబర్ వేతనాలు అందించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మోతుకూరి మదు, రంగారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సంఘం కార్యాలయంలో జరిగిన సమామేశంలో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా సుమారు వెయ్యి మంది జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు యలమద్ది వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో మహారాష్ట్ర వాసికి గాయాలు

బోనకల్, జనవరి 9: మండల పరిధిలోని రామాపురం రైల్వే గేటు సమీపంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన రైలు ప్రమాదంలో మహారాష్ట్ర వాసికి గాయాలయ్యాయి. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా వాసి సంజయ్ జీవనోపాధి కోసం విజయవాడలో సుతారి మేస్త్రీగా పని చేసేందుకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాద వశాత్తు ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి జారి పడటంతో గాయాలయ్యాయి. రైల్వే సిబ్బంది 108 వాహనానికి సమాచారం అందించడంతో అక్కడకు చేరుకున్నారు. సిబ్బంది కోట బాను సహాన్, కంచెపోగు ఆదాం ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కొరకు ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పెన్షనర్ల డైరీ ఆవిష్కరణ

సత్తుపల్లి, జనవరి 9: సత్తుపల్లిలో మంగళవారం ఆల్‌పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో 2024 నూతన సంవత్సరం డైరిని ఆవిష్కరించారు. స్థానిక సత్తుపల్లి డివిజన్ పెన్షనర్ల సంఘం కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానికి ఎస్‌బిఐ మేనేజర్ డాక్టర్ కే ప్రదీప్‌కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ డైరిని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కే వైకుంఠరావు, కార్యదర్శి ఎంఎస్ఆర్ శర్మ, గౌరవ అధ్యక్షుడు వి పద్మరావు, ఉపాధ్యక్షుడు డి.లక్ష్మీనారయణ, ఎం గంగాధరరాజు, డి వెంకటేశ్వర్లు, జివిఎన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ఖమ్మంక్రైం, జనవరి9: మహిళ మెడలో బంగారు గొలుసు గుర్తుతెలియని వ్యక్తి లాక్కుని పారిపోయాడు. ఈ సంఘటన మంగళవారం ఖమ్మం నగరంలో జరిగింది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన తుఖ్యారు లక్ష్మయ్య, సరస్వతి దంపతులు వారి నివాసంలోని వరండాలో కూర్చొని ఉండగా ఓ వ్యక్తి గేటు తీసుకొని లోపలికి వచ్చాడు. రామారావు ఇల్లు ఎక్కడ అంటూ అడిగాడు. తరువాత సరస్వతి దగ్గరకు వెళ్లి ఆమె మెడలోని సుమారు మూడు తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. అతనితోపాటు బయట మరో ఇద్దరు ద్విచక్ర వాహనంపై ఉండగా దానిపై ముగ్గురు కలిసి పారిపోయారు.

భక్తులకు అయోధ్య అక్షింతలు అందజేత

సత్తుపల్లి, జనవరి 9: మండలంలోని కిష్టారం గ్రామంలో మంగళవారం స్థానిక సర్పంచు చెట్టుమాల రేణుక ఈశ్వర్ ఆధ్వర్యంలో భక్తులకు అయోధ్య అక్షింతలు పంపిణీ చేశారు. ఇంటింటా తిరిగి వాటిని పంపంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు బొంతు నేరేంద్ర, నరుకుళ్ళ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.